

శిథిలావస్థలో ఉన్న ఫిట్టర్, మెషినిస్టు తరగతి గదులు



అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య నడుస్తున్న మహబూబాబాద్ ప్రభుత్వ ఐటీఐ

- ఉమ్మడి జిల్లాలో ఆరు ఐటీఐ ప్రాంగణాలు
- పదేళ్లుగా రాని రా మెటీరియల్ డబ్బులు
- పాత యంత్రాలతోనే విద్యార్థుల కుస్తీ
- సిబ్బంది కొరతతో అరకొర శిక్షణ
- శిథిలావస్థలో భవనాలు, వర్క్‌షెడ్లు
- కాంగ్రెస్ సర్కారూ పట్టించుకోవడం లేదని అభిప్రాయాలు



పూర్తిగా పాతబడి పోయిన వరంగల్ ఐటీఐ భవనం



అవస్థల మధ్య అంతంతమాత్రంగా!

కనీస వసతుల్లేక అధ్వానంగా పారిశ్రామిక శిక్షణ సంస్థలు

పాతబడిన భవనాలు.. ఎగిరిపోయి, కూలడానికి సిద్ధంగా ఉన్న రేకుల కప్పులు.. వాటిలో పాత కాలం నాటి యంత్రాలు.. కనిపించని కనీస వసతులు.. ఇవీ ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ)ల్లో కనిపిస్తున్న దుర్భర పరిస్థితులు. అయిదారు దశాబ్దాల క్రితం నిర్మించిన పాత భవనాలు కావడంతో అధ్వానంగా.. చూడడానికి డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. విద్యార్థులకు వివిధ వృత్తుల్లో సాంకేతిక శిక్షణనిచ్చి ఉపాధి కల్పించడానికి ఉద్దేశించిన ఉమ్మడిజిల్లాలో నిర్మించిన ఆరు ఐటీఐలు మారుతున్న కాలానికి అనుగుణంగా లేకపోవడం, నిధులు లేమి, ఫలితంగా రా మెటీరియల్ సరఫరా లేకపోవడం, టెక్నికల్ స్టాఫ్ సరిపడా లేకపోవడం పెద్ద సమస్యగా మారాయి. ఫలితంగా సరైన శిక్షణ పొందలేక.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉపాధి, ఉద్యోగావకాశాలను అంది అందిపుచ్చుకోవడంలో విద్యార్థులు వెనుకబడుతున్నారన్న వాదన వినిపిస్తోంది. ప్రభుత్వం ఓ వైపు వృత్తి విద్యను ప్రోత్సహించాలని చెబుతూనే మరో వైపు అదే వృత్తి విద్యను నేర్పే ఐటీఐలను మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీఆర్ఎస్ పాలనలో పదేళ్లు ఎలాంటి నిధులు రాకపోవడంతో ఐటీఐ ప్రాంగణాల నిర్వహణ పూర్తిగా డీలా పడిపోయిందని.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడు నెలలైనా ఏ మాత్రం పట్టింపు లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- హనుమకొండ, ఆంధ్రజ్యోతి

వివరాలు : 7 లో..

ప్రజా వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలి

ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎంసీపీఐ(యూ) నాయకులు

వరంగల్ కలెక్టరేట్, జూలై 1 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రజా వ్యతిరేక న్యాయ చట్టాలను ఉపసంహరించుకొని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ డిమాండ్ చేశారు. ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత నిరంకుశ పద్ధతుల్లో అమలు చేయనున్న క్రిమినల్ లా చట్టాలు అందులో భాగమేనని అన్నారు. 2022లో గిరిజనుల చట్టాలను సవరించే నూతన అటవీ చట్టాలను తీసుకొచ్చిందని తెలిపారు. తమకు తిరుగులేదని గతంలో సాగించిన మనువాద కార్పొరేట్ ఫాసిస్టు పాలనకు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక చట్టాలను, నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని రమేశ్ డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవికి అందజేశారు. కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి, జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంద రవి, రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబ బాబురావు, నాగెల్లి కొమురయ్య, వంగల రాగసుధ, కనకం సంధ్య, జిల్లా నాయకులు జగదీశ్వర్, కుమారస్వామి, మల్లికార్జున్, జన్ను రమేశ్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలతో సత్వర న్యాయం

- కేసుల విచారణలో జాప్యం ఉండదు
- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- నూతన చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, జూలై 1 : నూతన చట్టాలతో బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని, కేసుల విషయంలో జాప్యం ఉండదని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. సోమవారం హనుమకొండలోని కమిషనరేట్ కార్యాలయంలో మీడియా ప్రతినిధులకు సోమవారం నుంచి అమలవుతున్న నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నూతన చట్టాల అమలు తీరుపై కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నిపుణుల కమిటీ సుదీర్ఘంగా చర్చించి బ్రిటీష్ కాలం నాటి చట్టాల స్థానంలో నూతన చట్టాలకు రూపకల్పన చేయడం జరిగిందన్నారు. సోమవారం నుంచి నూతన చట్టాలు అమలులోకి వచ్చాయన్నారు. నూతన చట్టాల అమలుతో కేసుల విచారణలో జాప్యం ఉండదని, పారదర్శకంగా విచారణ ఉంటుందని అంబర్ కిషోర్ ఝా తెలిపారు. నేరం చేసిన వారు కేసుల నుంచి తప్పించుకోలేరని ఆయన అన్నారు. నేరం ఎక్కడ జరిగినా బాధితులు ఏ స్టేషన్‌లోనైనా ఫిర్యాదు చేయవచ్చన్నారు. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసుకుని విచారణ చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు మూడు రోజుల్లో సంబంధిత స్టేషన్‌కు వెళ్లి సంతకం చేసి ఎఫ్ఐఆర్ పొందవచ్చన్నారు. గత నెలాఖరు వరకు పాత చట్టాల ప్రకారంగా నమోదైన కేసుల విచారణ నూతన చట్టాల ఆధారంగా జరుగుతుందని ఆయన అన్నారు. ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో 50శాతం మహిళలు, పిల్లలపై జరుగుతున్నవేనన్నారు. వీటిని నియంత్రించేందుకు నూతన చట్టాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. కఠిన శిక్షలు పడే అవకాశం ఉందన్నారు. నూతన చట్టాలపై అన్ని వర్గాలకు అవగాహన కల్పించనున్నట్టు ఆయన తెలిపారు. ఇప్పటికే కమిషనరేట్ పరిధిలోని పోలీస్ సిబ్బందికి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ప్రతీరోజు పోలీస్ స్టేషన్‌లలో ఎస్‌హెచ్‌వోలు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు. ఏదైనా సమస్య ఉన్నప్పుడు బాధితులు 87126 85070 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి ఆయా స్టేషన్‌ల సిబ్బంది న్యాయం చేయడం జరుగుతుందన్నారు. స్టేషన్‌లలో న్యాయం జరగకుంటే ఏసీపీని కలువాలని అక్కడ న్యాయం జరగకుంటే నేరుగా తనను కలువవచ్చని అంబర్ కిషోర్ ఝా వివరించారు. అవగాహన కార్యక్రమంలో ఏసీపీలు జితెందర్‌రెడ్డి, డేవిడ్‌రాజ్, సీఐలు పుల్యాల కిషన్, శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రికి పూలమొక్కను అందిస్తున్న మంత్రి, మేయర్

సీఎంను కలిసిన మంత్రి సురేఖ, మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జూలై 1 : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటనలో జిల్లా ప్రజలకు భరోసా కల్పించినందుకుగాను రాష్ట్ర అటవీ, పర్యాటక, దేవాదాయ శాఖ మత్రి కొండా సురేఖ, వరంగల్ నగర కమిషనర్ గుండు సుధారాణి సోమవారం హైదరాబాద్ సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సంయుక్తంగా పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో అత్యంత వేగంగా పురోగమిస్తున్న వరంగల్ నగర ప్రగతిపై ప్రత్యేక శ్రద్ధవహించి నగర పురోగతిపై కట్టుదిట్టమైన కార్యాచరణ ప్రణాళికలు అమలు చేయాలని వారు సీఎంకు విజ్ఞప్తి చేశారు. వరంగల్ నగర సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా రానున్న ఐదేళ్లలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు తన పూర్తి సహకారం ఉంటుందని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. అభివృద్ధి పనులను పర్యవేక్షించేందుకు తాను మరో మారు వరంగల్ పర్యటనకు వస్తానని సీఎం తెలిపారు. వరంగల్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఇద్దరు ప్రజా ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు.

ప్రజావాణి వినతులను పరిష్కరించాలి

కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్య శారదాదేవి

వరంగల్ కలెక్టరేట్, జూలై 1: ప్రజల నుంచి స్వీకరించిన వినతుల పట్ల అలసత్వం వహించకుండా వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతీ దరఖాస్తును పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ప్రజావాణి నుంచి స్వీకరించిన జిల్లాకు చెందిన వినతులను సంబంధిత శాఖల అధికారులు వేగవంతంగా పరిష్కరించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణిలో మొత్తం 132 వినతులు అందగా రెవెన్యూ శాఖకు సంబంధించి 85, మహానగర పాలక సంస్థ 6, ఉపాధి శాఖ 6, లీడ్ బ్యాంకు 4, డీఆర్‌డీవో 4, డీపీవో 4, డీటీడీవో 3, వివిధ శాఖలకు చెందినవి 20 వినతులు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా, చెన్నారావుపేట మండలంలోని ఝల్లి, తిమ్మరాయినిపాడ్, ఎల్లయ్యగూడెం గ్రామాల్లోని సర్వే నెంబరు 70లో సుమారు 96 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా 50 ఏళ్లుగా ఖాస్తులో ఉంటున్నామని రైతులు ప్రజావాణిలో విన్నవించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్టా పాసుపుస్తకాలు ఇవ్వగా బ్యాంకులో రుణాలు సైతం తీసుకున్నామని తెలిపారు. నూతన పాసుపుస్తకాలు లేకపోవడంతో రైతుబంధు, ఇతర ఏపథకాలు అందడం లేదని, మా భూములకు పట్టాలిప్పించి న్యాయం చేయాలని రైతులు కోరారు.

విరమణ తర్వాత కుటుంబంపై శ్రద్ధ వహించాలి



సత్కార కార్యక్రమంలో కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, జూలై 1 : ఉద్యోగ విరమణ తర్వాత కుటుంబంతో పాటు పిల్లల చదువులు, భవిష్యత్తుపై శ్రద్ధవహించాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. గ్రేటర్ పరిధిలో సుదీర్ఘ కాలం పాటు వివిధ హోదాల్లో పని చేసి ఉద్యోగ విరమణ పొందుతున్న ఐదుగురికి సోమవారం సాయంత్రం బల్దియా కార్యాలయంలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జనగామ కలెక్టర్ రిజ్వాన్ భాషా మాట్లాడుతూ ఉద్యోగులు పని సమయంలో కుటుంబాన్ని సైతం పట్టించుకోకుండా ప్రజల కోసం పని చేస్తారన్నారు. కొందరు కుటుంబాలకు దూరంగా ఉంటారని అలాంటి వారు ఎప్పటికీ ప్రజల్లో గుర్తుండిపోతారన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారు శేషజీవితం సంతోషంగా గడపాలని అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, డిప్యూటీ సిటీ ప్లానర్ సీహెచ్ ప్రకాశ్ రెడ్డి, పీహెచ్ వర్కర్లు ఎస్. సుశీల, ఎం. సులోచన, హెల్పర్ ఎన్. లింగయ్యలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, కృష్ణారావు, ఈఈలు సంజయ్ కుమార్, శ్రీనివాస్, రాజయ్య, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్‌లతో పాటు ఉద్యోగ సంఘాల నాయకులు, జాక్ నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు కార్యాచరణ సిద్ధం చేయండి

వరంగల్ కలెక్టరేట్ : వన మహోత్సవంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అటవీశాఖ అధికారి అనూజ్ అగర్వాల్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా వన మహోత్సవంలో భాగంగా ఈనెల 7వ తేదీలోగా పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు అనువైన ప్రదేశాలను ఎంపిక చేసుకొని సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ భూములు, ఖాళీ స్థలాలు, కెనాల్, చెరువు గట్లు, అటవీ ప్రాంతాలను శాఖల వారీగా గుర్తించి నర్సరీల్లో మొక్కలు అందుబాటులో ఉంచుకొని గుంతలు తవ్వాలని తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాసరావు, జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్ కృష్ణారెడ్డి, ఎఫ్ఆర్‌వో సదానందం, డీపీఎం రేణుక తదితరులు పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి

వరంగల్ కలెక్టరేట్ : ధరణి పెండింగ్ దరఖాస్తులను వారంలోగా పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ధరణి పెండింగ్ సమస్యల ప్రగతిపై మండలాల వారీగా తహసీల్దార్లతో సమీక్షించారు. జిల్లాలో ఇప్పటి వరకు 792 దరఖాస్తులు పరిష్కరించగా పెండింగ్‌లో ఉన్న 2,962 దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ వారంలోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. తహసీల్దార్ల దగ్గర ఉన్న పెండింగ్ గ్రీవెన్స్, డ్యాష్‌బోర్డు నివేదిక, ఆర్‌డీవో, అదనపు కలెక్టర్ల వద్ద ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ధరణిలో మ్యాడ్యూల్స్‌ను సవరించిన నేపథ్యంలో వీలైనంత త్వరగా దరఖాస్తులను క్లియర్ చేయాలన్నారు. లీగల్ సమస్యలు మినహా మిగతా దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో కృష్ణవేణి, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్, అబిద్ అలీ, విశ్వనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతన్నకు మద్దతుగా..

వ్యవసాయ ఉత్పత్తులకు ధరలు పెంచిన కేంద్రం



వివరాలు : 7 లో..

సోమవారం ఉష్ణోగ్రతలు	
గరిష్ఠం :	30.5°C
కనిష్ఠం :	23.0°C

గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో కూలీ హత్య

- బండరాయితో తలపై మోది హతమార్చిన వైనం
- వరంగల్ నగరంలో ఘటన



వీరభద్రాచారి (ఫైల్)

మట్టెవాడ, జూలై 1: కూలి పనులు చేసుకునే ఓ వ్యక్తి గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో హత్యకు గురైన సంఘటన వరంగల్ నగరంలోని బట్టల బజార్ రోడ్డు ఆదివారం అర్ధరాత్రి జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, మట్టెవాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ ఎల్లంబజార్ ప్రాంతంలో పూసల వీరభద్రాచారి(52)కి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఉప్పరి మేస్త్రీ వద్ద కూలీగా పనిచేసే వీరభద్రాచారి ఆదివారం రాత్రి 9.30 గంటలకు ఇంట్లో చికెన్ ఇచ్చి పని ఉందని చెప్పి బయటికి వెళ్లాడు. ఆ తర్వాత అర్ధరాత్రి 2.30 గంటలకు వరంగల్ బట్టల బజార్ వేంకటేశ్వర స్వామి దేవాలయం పక్క వీధిలో వీరభద్రాచారి తలపై గుర్తు తెలియని వ్యక్తులు బండరాయితో కొట్టి హతమార్చగా.. రక్తపు మడుగులో పడి ఉన్న అతడిని గుర్తించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబసభ్యులు అక్కడికి చేరుకుని గుండెలవిసేలా రోదించారు. అయితే తన పనులు తాను చేసుకుంటూ ఎవరితో ఎలాంటి విబేధాలకు వెళ్లని వీరభద్రాచారిని ఇలా హతమార్చడం దారుణమని స్థానికులు పేర్కొంటున్నారు. మట్టెవాడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని హత్య జరిగిన తీరును పరిశీలించి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. వీరభద్రాచారి భార్య రాధిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ

బట్టల బజార్ రోడ్‌లో పూసల వీరభద్రాచారి హత్య జరిగిన ప్రాంతాన్ని సోమవారం ఉదయం వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ పరిశీలించారు. స్థానికంగా కార్మికులతో మాట్లాడారు. హత్య జరిగిన ప్రాంతంలో క్లూస్ టీం కొన్ని ఆధారాలు సేకరించగా.. మట్టెవాడ పోలీసు స్టేషన్ ఎస్ఐలు నవీన్‌కుమార్, లచ్చయ్య, సిబ్బంది వరంగల్ బట్టలబజార్, రామన్నపేట, ఎల్లంబజార్ ప్రాంతాల్లో సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించి పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

బీఎన్ఎస్ 103(1) సెక్షన్ కేసు నమోదు

నేరాల నియంత్రణ, వేగంగా శిక్షలు పడేలా కేంద్ర ప్రభుత్వం జూలై 1 నుంచి కొత్త చట్టాలను అమలులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఇవి అమలులోకి వచ్చిన తొలిరోజే వరంగల్ పోలీసు సబ్ డివిజన్‌లోని మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో బీఎన్ఎస్ 103(1) సెక్షన్ కింద హత్య కేసు నమోదైంది.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి : ఎమ్మెల్యే దొంతి



నర్సంపేట ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట టౌన్, జూలై 1 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నర్సంపేట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సోమవారం వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాల్లోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి పరిరక్షించాలన్నారు. భావితరాలకు కాలుష్య రహిత సమాజాన్ని అందించేందుకు మొక్కలు నాటాలని, అడవులను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే నర్సంపేట మండలం గార్ల తండాలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో చిన్నారులతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ కళావతి, ఎంపీడీవో శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సందడిగా కిడ్స్ అథ్లెటిక్స్ ఎంపికలు

జిల్లా వ్యాప్తంగా 240 బాలబాలికల హాజరు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 1 : వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో వరంగల్ జిల్లా స్థాయి బాలబాలికల (కిడ్స్) అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు సందడిగా ప్రారంభమయ్యాయి. సోమవారం జేఎన్ఎస్ లోని సింథటిక్‌ట్రాక్‌పై అండర్ 8, 10, 12 బాలబాలికల విభాగాల్లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి (కిడ్స్) అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించి జిల్లాకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకు రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యుగేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్ ఎంపికలో వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ మండల కేంద్రాల నుంచి 240 బాలబాలికలు పాల్గొనడం జరిగిందన్నారు.

ఇక్కడ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన 15 మంది బాల బాలికల ను ఈ నెల 7న హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలోని గోపీచంద్ అకాడమిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కిడ్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, షైన్ విద్యా సంస్థల ఛైర్మన్ మూగల కుమార్‌యాదవ్, కోచ్‌లు శ్రీమన్నారాయణ, నాగరాజు, పీఈటీలు కృష్ణమూర్తి, మహేందర్, శ్రీలత, శ్రీనాథ్, సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభిస్తున్న అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి

చిందు కళాకారులకు ఇందిరమ్మ ఇళ్లు

గడ్డం సమ్మయ్యకు అభినందన సభలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

దేవరుప్పుల, జూలై 1: అర్హులైన చిందు కళాకారులందరికీ ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తామని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సోమవారం మండలంలోని అప్పిరెడ్డిపల్లెకు చెందిన చిందు కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యకు స్వగ్రామంలో అభినందన సభ జరుగగా శ్రీహరితో పాటు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి, పాలకుర్తి కాంగ్రెస్ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ సమ్మయ్య తాతల కాలం నుంచి చిందు వృత్తితోనే జీవనం సాగించేవారని, సమ్మయ్య కూడా అదే వృత్తిని కొనసాగిస్తూ కళలను పదిమందికి ఉపయోగపడే విధంగా కృషి చేశారని అన్నారు. ఆయన కృషికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి పద్మశ్రీ ఇచ్చారని గుర్తు చేశారు.

చిందు కళాకారులతో పాటు మాదిగ ఉపకులాలకు ప్రభుత్వం ఆదుకునేలా కృషి చేస్తానన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ సమ్మయ్య పద్మశ్రీ అవార్డు పొందడం పాలకుర్తికే గర్వకారణమన్నారు. సమ్మయ్య కుటుంబంతో పాటు చిందు కళాకారులను అన్ని రకాలుగా ప్రభుత్వం ఆదుకునే విధంగా తాను కృషి చేస్తానన్నారు. ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ చాకలి అయిలమ్మ, దొడ్డి కొమురయ్య రజాకార్లకు ఎదురొడ్డి పోరాడిన గడ్డలో సమ్మయ్య జన్మించడం, చిందు కళలకు ఆజ్యం పోయడం, పద్మశ్రీ అవార్డు పొందడం చాలా ఆనందంగా ఉందన్నారు. మామిడి హరికృష్ణ మాట్లాడుతూ సమ్మయ్య పద్మశ్రీ పొందడం తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమన్నారు. ప్రభుత్వం తరుపున సమ్మయ్యతో పాటు చిందు కళాకారులను ప్రభుత్వం ఆదుకునే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా వారు సమ్మయ్యను పూలమాలలు, షాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గడ్డం మోహన్‌రావు, వంశీధర్‌రెడ్డి, శివకుమార్, రాంబాబు, నల్ల శ్రీరామ్, పులిగిళ్ల సుధాకర్, కందగట్ల సత్తయ్య, గడ్డం వెంకన్న, ఒగ్గు రవి, అందె భాస్కర్, రాజ్‌కుమార్‌నాయక్, గుర్రం సీతారామ్, లక్ష్మీనారాయణ నాయక్, మాచర్ల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



సమ్మయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, యశస్వినిరెడ్డి

సీపీఆర్‌పై పోస్టల్ కవర్ విడుదల

డాక్టర్ రామక శ్రీనివాస్ కృషితో రూపకల్పన



డాక్టర్ శ్రీనివాస్‌తో కలిసి పోస్టల్ కవర్‌ను విడుదల చేస్తున్న పోస్టుమాస్టర్ జనరల్ శ్రీలత

హనుమకొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్స్ డే సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని చారిత్రాత్మకమైన పోస్టాఫీసులో సీపీఆర్ ప్రక్రియ పోస్టల్ కవర్‌ను హైదరాబాద్ జోన్ పోస్టు మాస్టర్ జనరల్ శ్రీలత విడుదల చేశారు. అకస్మాత్తుగా గుండె పోటు వచ్చిన అత్యవసర సమయంలో చేయాల్సిన ప్రథమ చికిత్స కార్డియో పల్మనరీ పునరుజ్జీవనం (సీపీఆర్)పై గత రెండు దశాబ్దాలుగా కృషి చేస్తున్న హనుమకొండకు చెందిన ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ రామక శ్రీనివాస్ తపాలశాఖ సహకారంతో ఈ పోస్టల్ కవర్‌ను తయారు చేయించారు. సీపీఆర్‌పై తగిన ప్రచారం, ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ పోస్టల్ కవర్‌ను తపాలా శాఖ విడుదల చేసింది. ఈ సందర్భంగా పోస్టు మాస్టర్ జనరల్ శ్రీలత మాట్లాడుతూ డాక్టర్ శ్రీనివాస్ చాలా కాలంగా సీపీఆర్ పట్ల అవగాహన కల్పించేందుకు చేస్తున్న కృషిని కొనియాడారు. మానవ హక్కుల వేదిక నాయకుడు ఎస్ జీవన్ కుమార్ డాక్టర్ శ్రీనివాస్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ఆయన పొందిన పురస్కారాలను, సేవాభావాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్‌తో పాటు సీనియర్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎ సుబ్రమణ్యం, పోస్టల్ యూనియన్ నాయుడు సీహెచ్ ప్రతాపరెడ్డి, సీనియర్ మెడికల్ రిప్రజెంటేటివ్, మెడికల్ కౌన్సిలర్ పి భరత్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ (రిటర్డ్) వి. రామచంద్రారెడ్డి ఇతర పోస్టాసు సిబ్బంది పాల్గొన్నారు.

దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో నలుగురి డీబార్

కేయూ క్యాంపస్, జూలై 1 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర దూరవిద్య డిగ్రీ కోర్సుల పరీక్షల్లో చూచి రాతలకు పాల్పడగా పరీక్షల తనిఖీ అధికారులు పట్టుకుని నలుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్. నరేందర్‌లు సోమవారం తెలిపారు. డీబారైన వారిలో సికింద్రాబాద్ యూనివర్సిటీ పీజీ కళాశాల ఓయూలో ఇద్దరూ, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మరో ఇద్దరూ ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే పరీక్షల నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

జాతీయ స్థాయి ప్రేరణ శిక్షణకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 1 : జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రేరణ శిక్షణకు జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు డీఈవో డాక్టర్ ఎండి. అబ్దుల్ హై సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 4 నుంచి 10వ తేదీ వరకు గుజరాత్‌లోని వాదననగర్‌లో నిర్వహిస్తున్న అఖిల భారత ప్రేరణ శిక్షణకు పంథిని జడ్పీహెచ్ఎస్‌లో పదవ తరగతి చదువుతున్న కర్ణకంటి అక్షయ్‌రామ్, కాజీపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న గండి వర్ష ఎంపికైనట్లు ఆయన తెలిపారు.



అక్షయ్‌రామ్ వర్ష

ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన దర్బార్

ఏటూరునాగారం రూరల్, జూలై1: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్ కార్యక్రమం జరిగింది. వివిధ సమస్యలతో వచ్చిన గిరిజనుల వద్ద నుంచి పీవో చిత్రా మిశ్రా వినతులు స్వీకరించారు. మొత్తం 66 మంది గిరిజనుల తమ సమస్యల ను పీవోకు విన్నవించారు. గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో సీట్ కేటాయించాలని కన్నాయిగూడెం మండలం చింతగూడెం గ్రామానికి చెందిన చింత రుషి వినతి పత్రం అందించారు. సీఆర్‌టీగా ఉద్యోగావకాశం కల్పించాలని మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన తుమ్మి భాగ్య కోరారు. అనారోగ్యా కారణాల వల్ల ఇబ్బందులు పడుతున్నామని, ఐటీడీఏ ద్వారా ఆర్థిక సహాయం అందించాలని వెంకటాపురం మండలానికి చెందిన వర్షిణి విజ్ఞప్తి చేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఏఎన్ఓఎంగా ఉద్యోగావకాశం కల్పించాలని తాడ్వాయికి చెందిన దుగ్గిరాల శ్రీలేఖ వినతి పత్రం అందించారు. సర్వే నంబర్ 141, 142లోని భూమికి పట్టాలివ్వాలని ఏటూరునాగారం మండలం రొయ్యూర్ గ్రామానికి చెందిన తాటి నీలాద్రి కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వసంతరావు, డీడీ పోచం, ఏవో దామోదర స్వామి, ఎస్.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్‌పీడీసీఎల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా మధుసూదన్ బాధ్యతల స్వీకరణ



మధుసూదన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

హనుమకొండ టౌన్, జూలై 1 : ఎన్పీడీసీఎల్ ఇంచార్జి డైరెక్టర్ (ఆపరేషన్)గా మధుసూదన్ సోమవారం నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇంత కాలం ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించిన వి. మోహన్‌రావు జూన్ 30 న పదవి విరమణ పొందడంతో హెచ్‌ఆర్‌డి సీజీయంగా విధులు నిర్వర్తిస్తున్న టి. మధుసూదన్‌ను ఇన్‌చార్జి డైరెక్టర్ (ఆపరేషన్)గా నియమిస్తూ సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, సోమవారం బాధ్యతలు స్వీకరించిన మధుసూదన్‌ను ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పలు రైళ్లు దారిమళ్లింపు

కాజీపేట, జూలై 1 - బల్లార్షా సెక్షన్‌లో మూడో లైన్‌ల నిర్మాణపనుల కారణంగా ఈ నెల 3 నుంచి పలు రైళ్లను దారి మళ్లించి నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. సికింద్రాబాద్ న్యూఢిల్లీ మధ్య నడిచే తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు నిజామాబాద్, బల్లార్షా మీదుగా దారి మళ్లించి నడుపుతున్నారు. గోరఖ్‌పూర్ - యశ్వంతాపూర్‌ల మధ్య నడిచే యశ్వంతాపూర్ ఎక్స్‌ప్రెస్ మక్తల్, నిజామాబాద్‌ల మీదుగా, దారి మళ్లించినడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

అవస్థల మధ్య అంతంతమాత్రంగా!


వరంగల్ ఐటీఐలో అధ్వానంగా విద్యార్థుల టాయిలెట్లు

కనీస వసతుల్లేక అధ్వానంగా పారిశ్రామిక శిక్షణ సంస్థలు

- పదేళ్లుగా రాని రా మెటీరియల్ డబ్బులు
- పాత యంత్రాలతోనే విద్యార్థుల కుస్తీ
- సిబ్బంది కొరతతో అరకొర శిక్షణ
- శిథిలావస్థలో భవనాలు, వర్క్‌షెడ్లు


వరంగల్ ఐటీఐలో డ్రాఫ్ట్స్‌మెన్ తరగతుల భవనం దుస్థితిదీ..

హనుమకొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ ఐటీఐలు ఆరే ఉన్నాయి. వరంగల్, హనుమకొండ, కాజీపేటల్లో మూడు, మహబూబాబాద్, భూపాలపల్లి, ఏటూరునాగారంలో మరో మూడు నడుస్తున్నాయి. జనగామ జిల్లాలో ప్రభుత్వ ఐటీఐ లేదు. ఏటూరునా గరం ఐటీఐ ప్రధానంగా స్థానికంగా ఉన్న ఎస్టీలను దృష్టిలో పెట్టుకొని ఏర్పాటు చేసింది. ఈ ఐటీఐల్లో ప్రవేశాల్లో ఎస్టీలకు 80 శాతం రిజర్వేషన్ కల్పించారు. ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు ఐటీఐలు 21 వరకు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలపై మొత్తం అజమాయిషీ ఢిల్లీలోని డైరెక్టర్ జనరల్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రేనింగ్ (డేట్) అనే సంస్థదే. ఐటీఐల్లో ఇచ్చే పారిశ్రామిక శిక్షణకు సంబంధించిన సిలబస్‌ను ఈ సంస్థే తయారు చేస్తుంది. ఈ సంస్థ రూపొందించిన ట్రెయినింగ్ మ్యాన్యువల్‌నే వీటిలో అమలు చేస్తారు. కాగా ప్రభుత్వ ఐటీఐల్లో పని చేసే ఉద్యోగులకు మాత్రం వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. శిక్షణకు అవసరమైన మౌలిక సదుపాయాలను, సామగ్రిని సమకూర్చాల్సింది కూడా రాష్ట్ర ప్రభుత్వమే. ప్రభుత్వ ఐటీఐల్లో పది రకాల ట్రేడ్‌లలో శిక్షణ ఇస్తుండగా ప్రైవేటు ఐటీలు మాత్రం కేవలం ఒకటీ, రెండు ట్రేడ్‌లనే నిర్వహిస్తున్నాయి. వాటిలో ఎలక్ట్రీషియన్ తప్పని సరి. ఈ ఐటీలలో ఒక సంవత్సరం కోర్సు, రెండు సంవత్సరాల కోర్సులున్నాయి. ఎలక్ట్రీషియన్ రెండు సంవత్సరాల కోర్సు. కంప్యూటర్ ఆపరేటర్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ (కోపా) ఏడాది కోర్సు. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీల్లో ప్రవేశాలన్నీ ఆన్‌లైన్ ద్వారానే జరుగుతాయి. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే రిజర్వేషన్ ప్రకారం సీట్ల కేటాయింపు జరుగుతుంది.

అందని రా మెటీరియల్ డబ్బులు.. పాతయంత్రాలతోనే కుస్తీ..

ఐటీఐల్లో చదువుకునే విద్యార్థులకు ఆయా ట్రేడ్‌లలో పొందుతున్న శిక్షణకు గాను రా మెటీరియల్‌పైనే ప్రతీ నెల రూ.400 చొప్పున ప్రభుత్వం ఖర్చు చేయాలి. ఒక సంవత్సరం కోర్సు చదివే విద్యార్థికైతే సంవత్సరానికి రూ.4800, రెండు సంవత్సరాల కోర్సు విద్యార్థికి రూ.9600 ఖర్చు చేయాలి. ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలి. కానీ పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇప్పటి వరకు ఇవ్వలేదు. కేవలం ఐటీఐల్లో పని చేసే ఉద్యోగులకు జీతాలు మాత్రమే వస్తున్నాయి. చాలా ఐటీఐల్లో పాత యంత్రాలే ఉన్నాయి. బడ్జెట్ లేకపోవడంతో కొత్త యంత్రాలను కొనే పరిస్థితి లేదు. ఈ పాత యంత్రాలతోనే విద్యార్థులు కుస్తీ పడుతున్నారు. వీటిపైనే ప్రయోగాలు చేస్తున్నారు. రా మెటీరియల్ రాకపోవడం వల్ల విద్యార్థులు ప్రాక్టికల్స్ చేయడంలో ఇబ్బందులు పడుతున్నారు. పాత మెటీరియల్స్‌తోనే మళ్లీమళ్లీ చేయాల్సి వస్తోంది. ఉదాహరణకు ఒక ఫిట్టర్ విద్యార్థి ఇనుము మెటీరియల్ సరఫరా లేక గత విద్యార్థులు చేసిన ఇనుప ముక్కలతోనే మళ్లీ చేస్తున్నారు. అలాగే ఎలక్ట్రీషియన్ విద్యార్థి విద్యుత్ వైర్ల సరఫరా లేక పాత వైర్లతోనే సర్దుకోవలసి వస్తోంది. వెల్డింగ్ ట్రేడ్ విద్యార్థులు ఏడాదిలో 50 ప్రాక్టికల్స్ చేయాల్సి ఉంటుంది. మెటీరియల్ లేక పది, పదిహేను ప్రాక్టిల్స్‌తోనే సరిపెట్టుకోవలసి వస్తోంది. ఐటీఐల నిర్వహణ ఖర్చులను కూడా రాష్ట ప్రభుత్వం ఇవ్వడం లేదు. సరిగా బడ్జెట్ రాకపోవడం వల్ల ప్రతీ నెల విద్యుత్ బిల్లులను చెల్లించడం కూడా ఐటీఐలకు కష్టంగా మారింది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

ప్రభుత్వ ఐటీఐల్లో ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉంది. గత పదేళ్ల కాలంలో అనేక మంది ఉద్యోగులు రిటైర్ అయ్యారు. వారి స్థానంలో ఇప్పటి వరకు కొత్త నియామకాలు జరగేలేదు. కేవలం 40శాతం సిబ్బందితోనే ఐటీఐలు నడుస్తున్నాయి. ఇటీవల వీఆర్‌వోలు, వీఆర్‌వోలను జూనియర్ అసిస్టెంట్లుగా ఐటీఐలలో నియమించినా పెద్దగా ప్రయోజనం లేకుం డా పోయింది. వారికి వృత్తి శిక్షణకు సంబంధించిన కనీస పరిజ్ఞానం కూడా లేదు. గ్రామాల్లో మస్కూరు పని చేసే వీరికి సాంకేతికపరమైన వృత్తిశిక్షణపైగానీ, కనీసం ఆఫీసులో రికార్డుల నిర్వహణలోగానీ అవగా హన లేకపోవడం వల్ల వారు ఉన్నా ప్రయోజనం లేని పరిస్థితి ఉంది. ఒక్కో ఐటీఐకి ఇద్దరు, ముగ్గురిని నియ మించడంతో ఐటీఐల్లో సిబ్బంది ఉన్నట్టుపైకి కనిపిస్తు న్నది కానీ క్షేత్ర స్థాయిలో అంతాలోటే. ఇక ఐటీఐల్లో వృత్తిశిక్షణలో కీలకమైన టెక్నికల్ స్టాఫ్ మరీ తక్కువ గా ఉన్నారు. అన్ని ఐటీఐలలో 60 శాతానికిపైగా ఖాళీ లున్నాయి. రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం లోకి రాకముందు ఎప్పుడో పన్నెండేళ్ల క్రితం ఏపీపీ ఎస్సీ ద్వారా జరిగిన నియామకాలే తప్ప ఆ తర్వాత కాలంలో ఖాళీల భర్తీయే జరగలేదు. టీఎస్‌పీఎస్సీ ద్వారా ఇప్పటి వరకు ఎలాంటి నియామకాలు జరగలేదు. ఇటీవలే కొంత మంది కాంట్రాక్టు ఉద్యోగులను మాత్రం రెగ్యులరైజ్ చేశారు. ఇదొక్కటే ఐటీఐలో జరిగిన చెప్పుకోదగిన పరిణామం. ఐటీఐలో ఒక్కో యూనిట్ (ట్రేడ్)లో 20 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తారు. అలా ఎన్ని ట్రేడ్‌లు ఉంటే 20 మంది చొప్పున అంత మంది విద్యార్థులను తీసుకుంటారు. నిబంధనల ప్రకారం ఒక్కో ట్రేడ్‌కు ఒక ఇన్‌స్ట్రక్టర్ తప్పని సరిగా ఉండాలి. కానీ ఇన్‌స్ట్రక్టర్ల కొరత వల్ల ఉన్న వాళ్లే ఒక్కొక్కరు రెండు, మూడు ట్రేడ్లను చూసుకోవాల్సి వస్తోంది.

కానరాని కనీస సౌకర్యాలు

ప్రభుత్వ ఐటీఐల్లో కనీస సౌకర్యాలు భూతద్దం వేసి చూసినా కానరావు. ఐటీఐలకు ప్రస్తుతం ఉన్న భవనాలు 70, 80 ఏళ్లనాటివి. అవి పూర్తిగా పాతపడి శిథిలావస్థకు చేరుకున్నాయి. ములుగు రోడ్డులోని ఐటీఐలోని భవనాలు, వర్క్‌షెడ్లు పూర్తిగా పాతపడిపోయి కనిపిస్తాయి. మూత్ర, శాలలు, మరుగుదొడ్లు కూడా సరిగా లేవు. తాగునీటి సదుపాయం అసలు లేదు. అరకొర వసతుల మధ్య వృత్తిశిక్షణ పొందుతున్న విద్యార్థులు నిత్యం ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తోంది. మహబూబాబాద్ ఐటీఐ భవనం పూర్తిగా పాతపడడంతో దాని స్థానం కొత్త భవనం నిర్మించగా జిల్లా పోలీసు అధికారులు లాక్కొని అందులో ఎస్పీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. చేసేది లేక ఐటీఐను అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. భూపాలపల్లిలో ఐటీఐ కోసం కట్టిన కొత్త భవనంలో తొలుత కలెక్టరేట్ ఏర్పాటు చేయగా కలెక్టరేట్ భవనం పూర్తికావడంతో ఇటీవలే దానిని ఐటీఐకి తిరిగి అప్పగించారు.

జనగామలో ఎప్పుడు?

ఉమ్మడి వరంగల్‌లోని అయిదు జిల్లాల్లో ప్రభుత్వ ఐటీఐలు ఉండగా జనగామ జిల్లాలో మాత్రం ఇప్పటి వరకు ఏర్పాటు కాలేదు. ఈ జిల్లాకు ప్రభుత్వ ఐటీఐ ఇది వరకే మంజూరైంది. ఐటీఐ భవన నిర్మాణానికి సిద్దిపేట రోడ్డులోని గుట్టల సమీపంలో స్థలాన్ని కూడా కేటాయించారు. సర్వే కూడా పూర్తయింది. ఆ తర్వాత ప్రభుత్వం పట్టించుకోకపోవడం, స్థానిక ప్రజాప్రతి నిధులు ఒత్తిడి తీసుకురాకపోవడంతో జనగామలో ఐటీఐ ఏర్పాటు ఎక్కడవేసిన గొంగలి అక్కడే చందంగా మారింది. దీనితో విద్యార్థులు ప్రైవేటు ఐటీఐలపై ఆధారపడాల్సి వస్తోంది. ఇదే అవకాశంగా తీసుకొని ప్రైవేటు ఐటీఐలు విద్యార్థుల నుంచి ఫీజుల రూపంలో వేలాది రూపాయాలను గుంజుతున్నాయి.

ఒకే క్యాంపస్‌లో..

ములుగు రోడ్డులోని వరంగల్ ఐటీఐ క్యాంపస్ విశాలంగా ఉంటుంది. 70 ఏళ్ల క్రితం ఈ ఐటీఐ ఏర్పాటైంది. దీనికి విశిష్టమైన చారిత్రక నేపథ్యం ఉన్నది. ఈ ఐటీఐకి విశాలమైన స్థలం ఉండటంతో.. ఇదే అవకాశంగా అన్ని కార్యాలయాలను ఇందులోనే ఏర్పాటు చేశారు. హనుమకొండ ఐటీఐని కూడా ఇందులోకే మార్చారు. ఇది వరకు ఇది వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సమీపంలో అద్దె భవనంలో నడిచేది. దానిని ఈ ములుగు రోడ్డులోని ఐటీకి క్యాంపస్‌కు తరలించారు. ఐటీఐల రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం కూడా ఇందులోనే ఉంది. ఇది చాలదన్నట్టు వరంగల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసును, దీంతో పాటు రీజినల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసును సైతం ఇందులోనే చోటిచ్చారు. పట్టించుకునేవారు లేకపోవడంతో ములుగు రోడ్డులోని ఐటీఐ స్థలంలో కొంత భాగం అన్యాక్రాంతమైంది. విచిత్రమేమిటంటే ప్రస్తుతం పాత సెంట్రల్ జైలు స్థలంలో నిర్మాణంలో ఉన్న మల్టీసూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి బహుళ అంతస్తుల భవన స్థలంలో కొంత ఇందులోనే చూపారు.

ఏటీసీలు సరే.. ఐటీఐల్లోని సమస్యల సంగతేంటి?

ప్రభుత్వ ఐటీఐలు అనేక సమస్యల మధ్య కొట్టుమిట్టాడుతున్న నేపథ్యంలో టాటా టెక్నాలజీ లిమిటెడ్ (టీటీఎల్) సహకారంలో వీటిల్లో అడ్వాన్స్‌డ్ ట్రెయినింగ్ సెంటర్ (ఏటీసీ)లను ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఏటీసీలు ఐటీఐలో ఒక భాగంగానే నడుస్తాయి కానీ ప్రస్తుతం ఉన్న పాత ఐటీఐ పరిస్థితేంటన్నది ప్రశ్న. ఏటీసీలు మాత్రమే టీటీఎల్ ఆధ్వర్యంలో నడుస్తాయి. ఐటీఐలు మాత్రం యథావిధిగా ప్రభుత్వ యాజమాన్యంలోనే కొనసాగుతాయి. ఏటీసీలు ఏర్పాటయితే ప్రస్తుతం ఐటీఐల్లో నిర్వహిస్తున్న ట్రేడ్ల సంగతేమిటన్న ప్రశ్న కూడా ఉత్పన్నమవుతోంది. ప్రస్తుతం ప్రభుత్వ ఐటీఐల్లో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, డిజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, టర్నర్, మెషినిస్టు, కోపా ట్రేడ్లను నిర్వహిస్తున్నారు. వీటి కొనసాగింపు విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. ఐటీఐ ఆవరణలో ఏటీసీల నిర్వహణకు కొత్త భవనాల నిర్మాణం జరుగుతుంది. కానీ ఐటీఐ ప్రస్తుత పాత భవనాల సంగతేమిటీ? విద్యార్థులకు రామెటీరియల్ డబ్బులు ఇచ్చేది ఎవరు? సిబ్బంది ఖాళీల భర్తీ జరిగేనా? మౌలిక వసతుల కల్పన మాటేమిటీ? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఏటీసీల ఏర్పాటుతో పాటు సమాంతరంగా ఐటీఐలో ప్రస్తుతం నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, లేకుంటే ఏటీసీల ఏర్పాటుతో ఒరిగే ప్రయోజనం పెద్దగా ఏమీ ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రైతన్నకు మద్దతుగా..

వ్యవసాయ ఉత్పత్తులకు ధరలు పెంచిన కేంద్రం


ఘన్‌పూర్ మార్కెట్‌కు రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జూలై 1: రైతులు పండిస్తున్న పంటలకు మద్దతు ధరలను కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచింది. పెరిగిన ధరలు ఈ సీజన్ నుంచే అమలులోకి వచ్చాయని చెబుతున్నారు. ఏ పంట ధర ఎంత పెరిగింది? మార్కెట్ యార్డులో ఏ సరుకుకు ట్రేడర్లు ఎంత ధర ఇస్తున్నారు? అనేది ఈ ధరలతో రైతులు పోల్చుకుంటే నష్టపోకుండా ఉండవచ్చు. ఒక్కోసారి కొన్ని పంటలకు మద్దతు ధరల కంటే డిమాండ్‌ను బట్టి ఎక్కువ ధర కూడా లభించే అవకాశం ఉంటుంది. మద్దతు ధరలపై రైతులకు అవగాహన ఉంటే లాభపడే అవకాశం ఉంటుంది. ఐతే గత ఏడాది ధరలతో ఈ ఏడాది పెంచిన ధరలను.. పెరిగి పోతున్న పెట్టుబడి వ్యయంతో పోల్చి చూసుకుంటే పెద్దగా ఒరిగిందేమీ లేదని రైతులు పెదవి విరుస్తున్నారు. ఎంతైనా గుడ్డిలో మెల్లలా కొంత మేలు జరుగుతుందని ఆశిస్తున్నారు. దుక్కులు దున్నడం, విత్తనాలు వేయడం, ఎరువులు, పురుగు మందులు, కూలీ రేట్లు, కలుపు తీయడం, పంట కోత కోయించడం, తూర్పార పట్టించడం, మార్కెట్ యార్డుకు రవాణా చేయడం అన్నీ లెక్కలు వేసి చూసుకుంటే చివరకు ఏం మిగలడం లేదని వాపోతున్నారు. ఆరుగాలం కష్టించిన రైతుకు లాభం మాటేమోగాని కూలీ గిట్టుబాటు కాని దుస్థితి నెలకొందని వాపోతున్నారు. పెట్టిన పెట్టుబడికి, చేసిన అప్పులకు పోగా రోజుకు వంద, రెండు వందలు కూడా రైతుకు కూలి పడడం లేదని వాపోతున్నారు.

పంట పెట్టుబడి ఇలా..

ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులు వాటిని పండించడానికి పెడుతున్న పెట్టుబడి, వస్తున్న ఆదాయం లెక్క వేసి చూస్తే పెద్దగా ఫలితం ఉండడం లేదని తెలుస్తోంది. సన్న, చిన్న కారు రైతులకు వస్తున్న ఆదాయం ఏ మాత్రం చెప్పుకోదగినదిగా ఉండడం లేదంటున్నారు. వరి పంటకు ఎకరాకు పెట్టుబడి 20 నుంచి 25 వేల రూపాయల వరకు అవుతోందని, ట్రాక్టర్‌తో దున్నడానికి రూ.5 వేలు, విత్తనాలు వేయడానికి రూ.5 వేలు, కలుపు తీయడానికి రూ.3 వేలు, ఎరువులు, పురుగు మందులకు 3 వేలు, కోత కోయడానికి రూ.5 వేలు, రవాణ తదితర ఖర్చులు కలుపుకుని తడిసి మోపెడు అవుతోందని రైతులు వాపోతున్నారు. కాగా ఎకరాకు 30 నుంచి 40 బస్తాల ధాన్యం లేదా 20 నుంచి 22 క్వింటాళ్లు మాత్రమే వస్తోందని, ధాన్యం ధర క్వింటాల్‌కు కనీస మద్దతు ధర రూ. 2300 వేసుకున్నా 46 వేల నుంచి 50 వేల రూపాయలు వస్తున్నాయి. పెట్టుబడి పోను ఆరు నెలలు కష్టపడితే రూ. 20 వేల నుంచి 25 వేలు మాత్రమే మిగులుతన్నాయని చెబుతున్నారు. అంటే నెలకు రూ.3 వేల నుంచి 4 వేలు మాత్రమే మిగిలినట్టు. ఇంత తక్కువ మిగిలితే రోజు కూలి ఏం పడినట్టని ప్రశ్నిస్తున్నారు. ఉపాధి హామీ కూలికి వెళితే రోజుకు రూ.200ల నుంచి రూ.300లు కూలి వస్తున్నదని చెబుతున్నారు.



పెరిగింది గోరంతే...

తోట రమేశ్, రైతు, శివునిపల్లి

నాలుగేళ్ల క్రితం మద్దతు ధరలు కొంత మెరుగ్గానే పెరిగాయి. ప్రస్తుతం పంట పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ఈసారి పెరుగుదల అంతంతే ఉంది. ఏ మాత్రం గిట్టుబాటు కాదు. చేసిన కష్టం, పెట్టుబడి, నిర్వహణ ఖర్చులు అన్ని చూసుకుంటే లాభం మాటేమోగాని రైతులే మిగిలేలా ఉంది.

పెరిగిన మద్దతు ధరల వివరాలు

వరి సాధారణ రకం క్వింటాల్‌కు గత ఏడాది రూ. 2183 కాగా ఈ ఏడాది రూ.2300కి పెరిగింది. అంటే క్వింటాల్‌కు రూ. 117 పెరుగుదల ఉంది.

పంట	2024	2023	పెరుగుదల
వరి (సాధారణ)	2300	2183	117
వరి (ఏ గ్రేడ్)	2320	2203	117
పెసలు	8682	8558	124
మినుములు	7400	7050	450
మొక్కజొన్న	2225	2090	135
కందులు	7550	7000	550
వేరుశనగ	6783	6377	406
పత్తి(పొట్టిపింజ)	7121	6620	501
పత్తి(పొడుగుపింజ)	7521	7020	501
పొద్దు తిరుగుడు	7280	6760	520
సోయాబీన్(పసుపు)	4892	4600	292
నువ్వులు	9267	8635	632
జొన్నలు(హైబ్రిడ్)	3371	3180	191
జొన్నలు(మల్దండి)	3421	3225	196
సజ్జలు	2625	2500	125
రాగులు	290	3846	444

వరికి కనీసం రూ.500లు పెంచాలి



సముద్రాల రాజు, రైతు, నమిలిగొండ

ధాన్యానికి కనీస మద్దతు ధర రూ.500లు, పత్తికి రూ.1000లు పెంచితే రైతులకు కొంత లాభదాయకం. అలా కాకుండా ధాన్యానికి రూ.117, పత్తికి రూ. 501లు పెంచడం ప్రస్తుత పెట్టుబడికి ఏమాత్రం సరిపోదు. రైతుకు కనీసం కూలి రేటు కూడా పడకపోతే ఇక ఏం ఫలితం ఉంటుంది?

ఎద్దు పొడిచి గిరిజన రైతు మృతి


మృతి చెందిన రైతు బానోత్ శ్రీను

మహబూబాబాద్ రూరల్, జూలై 1 : ఎద్దు పొడవడంతో గిరిజన రైతు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ మండలం ఇస్లావత్‌తండా (ఎస్) శివారు బిచ్యాతండాలో అదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బిచ్యాతండాకు చెందిన బానోత్ శ్రీను (47) రెండు ఎడ్లు ఉన్నాయి. వర్షం వస్తుండడంతో ఆరు బయట ఉన్న పశువులను కొట్టంలో కట్టేసేందుకు వాటిని తీసుకువెళ్తన్నాడు. ఈ క్రమంలో ఎద్దు ఒక్కసారిగా శ్రీనును పొడవడంతో అతని తల ఇంటిగోడకు బలంగా తాకింది. దీంతో శ్రీను తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య నానుకి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య నానుకి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అన్నారం బ్యారేజీ వద్ద కొనసాగుతున్న పరీక్షలు

మహదేవపూర్, జూలై 1: భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అన్నారం (సరస్వతీ) బ్యారేజీ వద్ద నిపుణుల బృందం చేపడుతున్న పరీక్షలు 11 రోజులక చేరాయి. ప్యార్లర్ సెర్సింగ్ మెథడ్‌లో ఈ టెస్టులు జరుగుతున్నాయి. మొత్తం 42 ప్రాంతాల్లో ఈ టెస్టులు చేయాల్సి ఉండగా సోమవారం నాటికి ఏడు ప్రాంతాల్లో వీటిని నిర్వహించారు.

ఎస్సీ గురుకులాల్లో పార్ట్‌టైం లెక్చరర్లు, టీచర్లకు దరఖాస్తు ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 1 : హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల, కళాశాలల్లో పార్ట్‌టైం టీచర్లు, లెక్చరర్లుగా పనిచేసేందుకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆర్‌సీవో ఎస్. విద్యారాణి తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్, ఫిజిక్స్ కెమిస్ట్రీ, జువాలజీ, ఎకనామిక్స్, సోషల్, బయోసైన్స్, హిందీ, పీఈటీ పోస్టులు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పీజీతో పాటు బీఈడీ చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. జూలై 3వ తేదీ లోపు హనుమకొండ సర్క్యూట్ గెస్ట్ హౌజ్ ఎదురుగా ఉన్న ఆర్‌సీవో కార్యాలయంలో అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. 4వ తేదీన ఇంటర్వ్యూతో పాటు డెమో ఉంటుందని తెలిపారు.

ఎంబీఏ నాలుగో సెమిస్టర్ పరీక్షల రీ షెడ్యూల్

కేయూ క్యాంపస్, జూలై 1 : జూలై 2, 4 తేదీల్లో జరగాల్సిన కాకతీయ యూనివర్సిటీ ఎంబీఏ నాల్గవ సెమిస్టర్ పరీక్షలను డివిజన్ కౌంట్స్ ఆఫీసర్స్ పరీక్షల కారణంగా రీషెడ్యూల్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీ రామోజు నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికా రెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 2న జరుగాల్సిన పరీక్ష జూలై 20న, జూలై 4న జరుగాల్సిన పరీక్ష జూలై 22న జరుగుతుందని స్పష్టం చేశారు. పరీక్షల సమయం, పరీక్ష కేంద్రాల్లో ఏలాంటి మార్పులు ఉండవని పేర్కొన్నారు.

6 నుంచి ఎంసీఏ నాలుగో సెమిస్టర్ ఎగ్జామ్స్

కేయూ క్యాంపస్, జూలై 1 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎంసీఏ సీబీసీఎస్ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు జూలై 6 నుంచి జరుగుతాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 6, 9, 11 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు జరుగుతాయని పేర్కొన్నారు. రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్ అభ్యర్థులందరూ పరీక్షలకు హాజరుకావాలని కోరారు. కేయూ క్యాంపస్‌లోని కామర్స్ విభాగం, ఎడ్యుకేషన్ విభాగం, హనుమకొండ వాగ్దేవి పీజీ కళాశాల, సుబేదారిలోని యూనివర్సిటీ మహిళ కళాశాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఒకే ఈతలో ఏడు మేకల పిల్లలు


ఏడు పిల్లలకు జన్మనిచ్చిన మేక

మరిపెడ రూరల్, జూలై 1 : సహజంగా మేకలు, గొర్రెలు ఒకే ఈతలో 1, 2, లేదంటే మూడు పిల్లలు జన్మించడం సాధారణంగా చూస్తాం.. కానీ ఈ మేక గతంలో 3 పిల్లలకు జన్మినివ్వగా ఈ సారి ఏకంగా ఏడు పిల్లలకు జన్మనిచ్చింది. ఈ అరుదైన ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామంలో చోటు చేసుకుంది. రైతు రేఖ వెంకన్నకు చెందిన మేక ఏడు పిల్లలకు జన్మనిచ్చింది. జన్మించిన ప్రతి పిల్ల ఆరోగ్యంగా ఉండడంతో రైతు సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. ఇందులో నాలుగు పోతు పిల్లలు, మూడు కొదమలు ఉన్నట్లు రైతు తెలిపారు.


టెక్స్‌టైల్ పార్కును సందర్శించిన 'యంగ్‌వన్' చైర్మన్



హెలిప్యాడ్ వద్ద టీజీఐఐసీ జోనల్ మేనేజర్ సంతోష్‌కుమార్‌తో మాట్లాడుతున్న చైర్మన్ కిహాక్‌సంగ్

గీసుగొండ, జూలై 1: గీసుగొండ మండలం శాయంపేటహవేలి గ్రామశివారులోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ)ను దక్షిణకొరియా దేశానికి చెందిన యంగ్‌వన్ కంపెనీ చైర్మన్, సీఈవో కిహాక్‌సంగ్, కంపెనీ ప్రెసిడెంట్ మిన్‌సుక్‌లీ, డైరెక్టర్ ఎండీ షాజాహాన్ సోమవారం సందర్శించారు. సోమవారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డితో హైదరాబాద్‌లో అపాయింట్‌మెంట్ ఉన్న నేపథ్యంలో వారు తొలుత టెక్స్‌టైల్ పార్కుకు చేరుకుని తమ కంపెనీ ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించేందుక వచ్చారని టీజీఐఐసీ అధికారులు తెలిపారు. హైదరాబాద్ నుంచి నేరుగా హెలికాప్టర్‌లో పార్కుకు వచ్చిన కంపెనీ ప్రతినిధులు స్థలం మ్యాప్‌ను పరిశీలించడంతో పాటు 3 గంటల పాటు వారు కంపెనీ నిర్మాణాలపై చర్చించారు. యంగ్‌వన్ కంపెనీకి పార్కులో వస్త్ర పరిశ్రమలను నెలకొల్పేందుకు 297 ఎకరాలను టీజీఐఐసీ కేటాయించగా రూ.980 కోట్ల అంచనా వ్యయంతో కొద్దినెలల క్రితం కంపెనీ నిర్మాణ పనులను చేపట్టింది. ఇందులో 12వేల మందికి ప్రత్యక్షంగా, మరో 10వేల మందికి పరోక్షంగా ఉపాధి లభించే అవకాశం ఉందని టీజీఐఐసీ అధికారులు చెబుతున్నారు. వస్త్ర పరిశ్రమల రంగంలో యంగ్‌వన్ కంపెనీకి ప్రపంచంలోనే మంచి గుర్తింపు ఉందని, ఫామ్ టూ ఫ్యాషన్ ఫారిన్ అనే విధంగా ఇందులో వస్త్రాలు తయారు చేస్తారని అధికారులు పేర్కొన్నారు. యంగ్‌వన్ కంపెనీ ప్రతినిధుల వెంట టీజీఐఐసీ జోనల్ మేనేజర్ రామా సంతోష్‌కుమార్, తదితరులున్నారు.

బాల్యంపై.. బ్యాగు భారం!



- పుస్తకాల మోతతో విద్యార్థుల అవస్థలు
- ఏటేటా పెరుగుతున్న బరువు
- చిన్న వయస్సులోనే వెన్నెముక సమస్యలు
- అమలు కాని విద్యాహక్కు చట్టం నిబంధనలు
- అవగాహన కల్పించని అధికారులు

వరంగల్ జిల్లాలో 244 ప్రైవేటు పాఠశాలలు ఉండగా 70,520 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే చాలా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తమ లాభాపేక్ష కోసం పలు పబ్లికేషన్స్ రూపొందించిన, తమ సంస్థల పేరిట ముద్రించిన పుస్తకాలను కొనాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులకు సూచిస్తున్నాయి. ఈ క్రమంలో ఎల్‌కేజీ చదువుకునే విద్యార్థికి 6 నుంచి 10 పాఠ్య పుస్తకాలు, క్లాస్ వర్క్, హోమ్‌వర్క్ కోసమంటూ పదుల సంఖ్యలో నోట్ పుస్తకాలు ఇస్తున్నాయి. తల్లిదండ్రులు వాటిని బ్యాగుల్లో ఉంచి పిల్లలను బడికి పంపుతున్నారు. వీటికి లంచ్ బాక్స్, వాటర్ బాటిల్ తోడవడంతో బ్యాగు బరువు 4 నుంచి 6 కిలోల వరకు అవుతోంది. ఇలా తరగతి పెరిగే కొద్దీ బరువు పెరుగుతోంది. ఈ మోత భారంతో పిల్లలు చిన్నతనం నుంచే అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.

వర్ధన్నపేట రూరల్, జూలై 1 : పుస్తకాల బరువు బాల్యాన్ని కుంగదీస్తోంది. కిలోలకు కిలోల బరువుంటున్న పుస్తకాల బ్యాగులతో చిన్నారుల వెన్నెముక వంగిపోతోంది. ప్రైవేటు పాఠశాలల పుణ్యమా.. అని ఒకటి, రెండు తరగతుల విద్యార్థులే 20 నుంచి 25కిలోల పుస్తకాలను మోస్తున్నారు. వాస్తవానికి విద్యార్థి బరువులో 10 శాతం మాత్రమే పుస్తకాల బరువు ఉండాలని చెబుతున్న విద్యాహక్కు చట్టం.. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు అసలు పుస్తకాలు ఉండొద్దని పేర్కొంటోంది. కానీ, ఈ నిబంధనలేవీ అమలవడం లేదు. అవసరం లేని పుస్తకాలను పాఠశాలలలోనే భద్రపరుచుకునేలా లాకర్ల సదుపాయం ఏర్పాటు చేయాలని ఉన్నా చాలా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. మరోవైపు మారిన ఫ్యాషన్ పోకడలతో ప్రస్తుతం విద్యార్థులు నడుం కిందకు బ్యాగు వేలాడేలా వేసుకుంటున్నారు. దీని వల్ల మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

అవసరం లేని పుస్తకాలే ఎక్కువ..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆరు సబ్జెక్టులకు సంబంధించిన ఆరు పుస్తకాలు, నోట్ పుస్తకాలు ఉంటాయి. కానీ, ప్రైవేట్ పాఠశాలల్లో మాత్రం అందుకు విరుద్ధంగా తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని మోపేందుకు ఒకటి, రెండు తరగతులు చదివే విద్యార్థులకు 10 నుంచి 12 పుస్తకాలు, ఒక్కో సబ్జెక్టుకు తరగతి వర్క్‌బుక్, హోం వర్క్, ప్రాజెక్టు పని ఇలా మూడేసి పుస్తకాలు కొనుక్కోవాలని చెబుతున్నారు. పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ మొత్తం 30 నుంచి 45 అవుతుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అవసరం లేని పుస్తకాలను పక్కకు పెట్టి అవసరం ఉన్న వాటిని వాడుకుంటే మంచిదని నిపుణులు చెబుతున్నారు.

ఈసారైనా అవగాహన కల్పించేనా..?

విద్యాహక్కు చట్టంపై క్షేత్రస్థాయిలో అధికా రులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్న తెలంగా ణ ప్రభుత్వం అదే స్థాయిలో విద్యాహక్కు చట్టం ప్రైవేటు పాఠశాలల్లో అమలవుతుందా.. లేదా చూసుకోవడంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రు లు ప్రైవేటు యాజమాన్యాలను ప్రశ్నించేలా చట్టంపై అవగాహన తేవా లి. ఆయా మండలాల్లోని ఎంఈవోలతో కలిసి సమావేశాలు ఏర్పాటు చేయడంతో పాటు కళాజాత మాదిరిగా, ప్రభుత్వ పాఠశాలల పనితీరు ను వివరించేటప్పుడు, విద్యా హక్కుపై గల సామాన్య ప్రజల హక్కును గుర్తుచేయాల్సి బాధ్యత ఎంతైనా ఉంది.

అధిక భారం వెన్నుపూస పైనే..

నిటారుగా నిలబడాలంటే వెన్నుపూస ప్రధాన ఆధారం. పుస్తకాల బ్యాగును వీపుపై వేసుకోవడం వల్ల వెన్నెముకపై భారం పడుతోంది. దీంతో అది దెబ్బతినే ప్రమాదం ఉంది. 15ఏళ్ల పిల్లల శరీరంలో వివిధ రకాల మార్పులు సంభవిస్తాయి. ఈ వయస్సులో వెన్నెముకపై సామర్థ్యానికి మించి భారం వేయడం వల్ల అనేక సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరి స్తున్నారు. వెన్నుముక, మెడ నొప్పులు వచ్చే ప్రమాదం ఉంద ని చెబుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని అంటున్నారు.

అమలుకు నోచుకోని చట్టాలు..

ప్రైవేట్ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల పాఠ్యపుస్తకాల బరువు తగ్గించా లని ప్రభుత్వం 2006లోనే చట్టాన్ని తీసుకొచ్చింది. కానీ, అది అమలుకు నోచుకోవ డం లేదు. విద్యార్థి శరీర బరువులో 10 శాతం మాత్రమే పాఠ్యపుస్తకాలు ఉండేలా ఆ చట్టం చెబుతోంది. విద్యార్థి సుమారు 14కిలోలు ఉన్నాడనుకుంటే ఆవిద్యార్థి తీసుకెళ్లే బ్యాగు మాత్రం 4 కిలోలు ఉంటుంది. దాన్ని మోసేందుకు విద్యార్థి అష్టక ష్టాలు పడాల్సిన పరిస్థితి. ప్రైవేటు పాఠశాలలు నాలుగైదు అంతస్థుల్లో ఇరుకిరుకు గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. దాంతో విద్యార్థులు పుస్తకాల బ్యాగులతో అన్ని అంతస్థులు ఎక్కాల్సిందే.

వెన్నుముకపై భారం పడుతుంది



డాక్టర్ సోమశేఖర్, ఎండీ సర్జన్

చిన్న వయసులోనే విద్యార్థులు అధిక పుస్తకాలు గల బ్యాగులు మోయడంతో బరువు నేరుగా వెన్నెముకపై పడుతుంది. ఎంతో సున్నితమైన ప్రదేశంలో మనకు తెలియకుండా రోజు రోజుకు భారం పెరగడంతో ఒక్కసారిగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. బోధన విధానం, చదువుకునే తీరు కూడా సమయాన్ని బట్టి అనుసరించాలి. ఆడుకునే సమయంలో ఆడుకోకుండా చదవడమే చేస్తే మానసికంగా విద్యార్థులు ఇబ్బందులకు గురవుతారు.

పిల్లలపై ఒత్తిడి తగ్గించాలి



గాండ్ల కుమార్, వర్ధన్నపేట

పిల్లలపై పుస్తకాల బరువుతో పాటు మానసికంగా కూడా పాఠశాలల యాజమాన్యాలు ఒత్తిడి తెస్తున్నాయి. చిన్న వయసులో ప్రశాంతంగా ఉండాల్సిన విద్యార్థులు పేజీల కొద్ది పుస్తకాలు తిరగేస్తూ ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు. ప్రభుత్వం విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయడంలో విఫలమైంది. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రైవేటు పాఠశాలలపై ఎల్లప్పుడు నిఘా పెంచితే వారి ఆగడాలను అరికట్టవచ్చు.



తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సురేష్

కరీమాబాద్, జూలై 1: తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అండర్ రైల్వేగేటు ప్రాంతం రంగశాయిపేటకు చెందిన వాసం సురేష్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్ తెలిపారు. నగరంలోని ఓ సిటీలో సోమవారం తెలంగాణ బీసీ ప్రజాసంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సురేష్‌ను ప్రకటించి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ సురేష్ నిబద్ధతగల వ్యక్తిగా అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటూ చురుకుగా సేవలందిస్తున్నాడని తెలిపారు. వాసం సురేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంతటి బాధ్యతను అప్పగించిన అధ్యక్షుడు నాయిని భరత్‌కు, సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర మహిళా ఇన్‌చార్జ్ డాక్టర్ లయన్ పద్మజ, ఉమ్మడి వరంగల్ జిల్లా యూత్ అధ్యక్షుడు ఆవునూరి సతీష్, వరంగల్ తూర్పు నియోజకవర్గ మహిళా నాయకురాలు సాగరిక, రజిత, శ్రీలత, శృతి, నూనె రవి తదితరులు పాల్గొన్నారు.

దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు ముఖర్జీ

▸▸ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న చందుపట్ల కీర్తిరెడ్డి

మిల్స్‌కాలనీ, జూలై 1 : దేశం కోసం ప్రాణాలర్పించిన డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ మహనీయుడని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం వరంగల్ దేశాయిపేటరోడ్‌లోని పార్టీ తూర్పు కార్యాయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కీర్తిరెడ్డి మాట్లాడారు. ఒక దేశంలో రెండు జెండాలు ఉండకూడదని ముఖర్జీ వాదించారన్నారు. ముఖర్జీ రాజ్యాంగకమిటీలో సభ్యులని, కలకత్తాను పాకిస్తాన్‌లో కలుపకుండా కాపాడిన ఘనత ముఖర్జీకే దక్కుతుందన్నారు. ఆనాడు ఆయన స్థాపించిన జన సంఘ్ పార్టీనే రూపాంతరం చెంది నేడు బీజేపీగా మారిందని కీర్తిరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, ప్రోగ్రాం కన్వీనర్ మల్లాడి తిరుపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, కొండేటి శ్రీధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రత్నం సతీష్‌సా, నాయకులు వన్నాల వెంకటరమణ, కుంభంపాటి పుల్లారావు, రాణాప్రతాప్‌రెడ్డి, పరమేశ్వర్, హరిశంకర్, శ్రీనివాస్, రంజిత్, రఘునారెడ్డి, శిల్ప, శ్రీధర్, రాజేష్, నాగరాజు, రాంచంద్రారెడ్డి, నర్సింహరాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చార్టర్డ్ అకౌంటెంట్స్ డే

మట్టెవాడ, జూలై 1: ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా వరంగల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో సీఏ భగవాన్‌దాస్ ముందడ ఆధ్వర్యంలో 76వ చార్టర్డ్ అకౌంటెంట్స్ డే వేడుకలను సోమవారం హంటర్‌రోడ్‌లోని ఐసీఏఐ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఏ జెండాను భగవాన్‌దాస్ ముందడ ఎగురవేసి మాట్లాడారు. దేశ ప్రగతిలో సీఏల పాత్ర కీలకమని, సీఏ విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. అదే విధంగా సీఏ డే సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని, వృద్ధులకు దుప్పట్ల పంపిణీ, పండ్లు అందజేశారు. సీఏలకు, సీఏ విద్యార్థులకు ఉచితంగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సత్యనారాయణ, కార్యదర్శి మాదారపు సుజిత్, మెంబర్ రాయబారపు హరికృష్ణ, స్టూడెంట్స్ అసోసియేషన్ చైర్మన్ మన్నెం రామకృష్ణ, దేవసహాయం, పీవీ.నారాయణరావు, కరుణాకర్, రాజు కొయ్యల, చంచల్ అగర్వాల్, సంధ్యారాణి, రాఘవరెడ్డి, శ్రీధర్, కేవీఎస్.రీష్‌కుమార్, టి.రాఘవరెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో జీపీ ఉద్యోగి మృతి



సూరయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై నరేష్

సంగెం, జూలై 1: గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని ఎల్గూరు రంగంపేటలో చోటుచేసుకుంది. గ్రామస్థులు, ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... ఎల్గూరురంగంపేట గ్రామానికి చెందిన కడారి సూరయ్య(58) స్థానిక గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా సోమవారం ఉదయం ఫ్యూజ్ వైరు పోవడాన్ని గుర్తించి విద్యుత్ స్తంభంపై వేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురవడంతో కిందపడి మృతి చెందాడు. కుమారుడు రంజిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎంకు తరలించగా, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై వివరించారు. సూరయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. కాగా, మృతదేహాన్ని పర్వతగిరి సీఐ శ్రీనివాస్ సందర్శించి పరిశీలించారు. నిరుపేద అయిన సూరయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

రోడ్డును ఆక్రమించి ఇళ్లను నిర్మిస్తున్నారు

▸▸ బల్దియా ప్రజావాణిలో ప్రజల వినతి

▸▸ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

▸▸ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



కమిషనర్‌కు బిల్లులు చెల్లించాలని ఫిర్యాదు చేస్తున్న కాంట్రాక్టర్లు

వరంగల్ కార్పొరేషన్, జూలై 1: కొన్ని కాలనీల్లో కబ్జాదారులు రోడ్డును ఆక్రమించి ఇళ్లు నిర్మిస్తున్నారని, పలు కాలనీల్లో డ్రెయినేజీ నీటి సమస్యలు ఉన్నాయని ఇలా ప్రజల ఫిర్యాదులతో బల్దియా ప్రజావాణి(గ్రీవెన్‌సెల్) వరంగల్‌లోని బల్దియా కౌన్సిల్ హాల్‌లో సోమవారం కొనసాగింది. గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థ కమిషనర్‌తోపాటు వివిధ వింగ్ అధికారులు ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతీ వారం గ్రీవెన్స్ ద్వారా స్వీకరించిన ఫిర్యాదులకు తక్షణమే పరిష్కారం చూపాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. మొత్తంగా 81 ఫిర్యాదులు అందినట్టు బల్దియా పీఆర్‌వో అయూబ్ ఖాన్ వెల్లడించారు. ఇటీవల వరంగల్‌లో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసిన సిబ్బందిని కమిషనర్ ప్రశంసించారు. కార్యక్రమంలో ఎస్‌ఈలు కృష్ణారావు,ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, సీపీ వెంకన్న, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, టీపీఆర్‌వో రాజేశ్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డిలతో పాటు వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

● హనుమకొండ హంటర్‌రోడ్డులోని గాయత్రి కాలనీలో గత నాలుగు మాసాలుగా ఇళ్ల మధ్యలో ఓ ఇంటిని లాడ్జి(గెస్ట్‌హౌస్)గా చేసి వ్యభిచారం చేయిస్తున్నారని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు.

● గ్రేటర్ 3వ డివిజన్ ఆరెపల్లి శివారులోని బీరన్న దేవాలయానికి సంబంధించిన సుమారు 13 గుంటల దేవుడి భూమిని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఆక్రమించి కట్టడాలు జరుపుతున్నారని కురుమ సంక్షేమ సేవా సమితి నాయకులు ఫిర్యాదు చేశారు.

● బల్దియా పరిధిలోని రోడ్లు, డ్రెయినేజీలతో పాటు పలు అభివృద్ధి పనులు చేసి చాలా రోజులు గడుస్తున్నా బిల్లులు ఇవ్వడం లేదని, పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని జీడబ్ల్యుఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు ప్రజావాణితో విన్నవించారు.

● హనుమకొండ 41వ డివిజన్ నాగేంద్రనగర్‌లో మునిసిప్ నిబంధనల ప్రకారం లే ప్లాట్లలో సుమారు 30 ఇళ్లు నిర్మించుకున్నాం. కానీ, ఇటీవల ఓ వ్యక్తి తమ ఇళ్లకు వచ్చే 20 ఫీట్ల రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నాడని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు.

● వరంగల్ పడమరకోట దళితవాడలో గత వారం రోజులుగా మంచినీరు రాకపోవడం వల్ల ప్రజలు తండ్లాడుతున్నారని కాలనీ ప్రజలు కమిషనర్‌ను విన్నవించారు.

● గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ సురేంద్రపురి కాలనీలో 2 ఎకరాల స్థలంలో ఓ వ్యక్తి అనధికారిక నిర్మాణాలు చేపడుతున్నాడు. మునిసిపాలిటీ నిబంధనలు అతిక్రమించి రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించేందుకు స్థలం వదిలి వేయకుండా కట్టడాలు జరుపుతున్నాడని ఫిర్యాదు చేశారు. కాగా, గ్రీవెన్స్‌లో ఇంజనీరింగ్-25, హెల్త్ అండ్ శానిటేషన్-06, ప్రాపర్టీ ట్యాక్స్-09, టౌన్ ప్లానింగ్-41 ఫిర్యాదులు అందాయి.

బదిలీ అయిన ఉపాధ్యాయుడిని రిలీవ్ చేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 1 : ఎస్‌టీజీ ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా బదిలీ అయిన ఉపాధ్యాయులను రేషనలైజేషన్ పేరుతో వారిని అదే పాఠశాలలో కొనసాగించడం సరికాదని తపస్ వరంగల్‌జిల్లా గౌరవ అధ్యక్షుడు పిన్నింటి బాలాజీరావు అన్నారు. ఇప్పటికే బదిలీల్లో అంతర్గత రేషనలైజేషన్ పాటించి ఉపాధ్యాయ పోస్టులను తగ్గించి చూపించినప్పటికీ మళ్లీ రేషనలైజేషన్ పేరుతో వారిని రిలీవ్ చేయకుండా ఉండటం సమంజసం కాదన్నారు. అలాగే ఖాళీలను సీనియారిటీ లిస్టులో ఉన్న వారితో భర్తీ చేయాలన్నారు. స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులను ఇవ్వగా మిగిలిన అన్ని ఖాళీలను సీనియారిటీలిస్టులో తదుపరిఉన్న ఎస్‌జీటీ ఉపాధ్యాయులతో నింపాలని తెలిపారు.

ఎస్జీటీల బదిలీల ఉత్తర్వులు

▸▸ వరంగల్‌లో 460, హనుమకొండలో 319 మంది బదిలీ

▸▸ పండిట్లు, పీఈటీలకు ఇంకా అందని బదిలీల ఉత్తర్వులు



బదిలీల ఉత్తర్వులు అందుకుంటున్న ఉపాధ్యాయులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 1: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో చివరి అంకం ముగియనుంది. ఎస్జీటీ ఉపాధ్యాయుల బదిలీల ఉత్తర్వులు వెలువడడంతో ప్రభుత్వం నిర్వహించిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. సోమవారం ఎస్జీటీలు బదిలీల ఉత్తర్వులను సంబంధిత అధికారుల నుంచి అందుకొని వారికి కేటాయించిన పాఠశాలల్లో చేరారు. అయితే ఎస్జీటీ తత్సమాన అర్హత కలిగిన లాంగ్వేజ్ పండిట్లు, పీఈటీలకు మాత్రం సోమవారం సాయంత్రం వరకు బదిలీల ఉత్తర్వులు వెలువడకపోవడంతో బదిలీల అంకం ఇంకా ముగియలేదు. పండిట్లు, పీఈటీలు సోమవారం రాత్రి వరకు బదిలీల ఉత్తర్వుల కోసం వేచి చూశారు. వరంగల్ జిల్లాలో 460 మంది ఎస్జీటీలు బదిలీ కాగా, 22 మంది ఎల్పీలు, పీటీలు బదిలీల ఉత్తర్వుల కోసం ఎదురుచూస్తున్నారు. హనుమకొండ జిల్లాలో 319 మంది ఎస్జీటీలు బదిలీల ఉత్తర్వులు అందుకోగా, 33 మంది పండిట్లు, పీటీలు బదిలీల ఉత్తర్వుల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే సోమవారం అర్ధరాత్రి కల్లా వారికి బదిలీల ఉత్తర్వులు అందుతాయని విద్యాశాఖాధికారులు వెల్లడించారు.

ఎంపీ అరవింద్‌ను పరామర్శించిన బీజేపీ నేతలు



స్వగృహంలో ఎంపీ అరవింద్‌ను పరామర్శిస్తున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, అరూరి రమేష్

శంభునిపేట, జూలై 1 : నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తండ్రి, మాజీ మంత్రి డి.శ్రీనివాస్ ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. సోమవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావుతో కలిసి వరంగల్ జిల్లాకు చెందిన పార్టీ నేతలు అరవింద్‌ను కలిసి పరామర్శించారు. అంతకుముందు డి.శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, జిల్లా మాజీ అధ్యక్షుడు ఎడ్ల అశోక్, ఉపాధ్యక్షుడు సిద్దం నరేష్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్నలే దేశానికి వెన్నుముక

▸▸ పీఏసీఎస్ చైర్మన్ కేడల జనార్దన్

శంభునిపేట, జూలై 1 : పంటలు పండించి అన్నం పెట్టే రైతన్నలే దేశానికి వెన్నుముక అని ఖిలావరంగల్ పీఏసీఎస్ చైర్మన్ కేడల జనార్దన్ అన్నారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం సోమవారం సొసైటీ భవనంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్ బి.సంజీవరెడ్డి హాజరై మాట్లాడారు. రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు పలు పథకాలను అమలు చేస్తున్నాయని తెలిపారు. చైర్మన్ కేడల జనార్దన్ మాట్లాడుతూ సబ్సిడీలు, ఆర్థిక సహకారం రైతులకు బాసటగా ఉంటుందన్నారు. చెమటోడ్చి పండించే ప్రతీ రైతును ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకునేలా పథకాలు అమలు చేయాలన్నారు. అనంతరం రైతుబంధు(రైతు భరోసా) అమలుపై రైతుల నుంచి అభిప్రాయ సేకరణ తీసుకున్నారు. సోమవారం రైతు దినోత్సవం సందర్భంగా లయన్స్‌క్లబ్ బాధ్యులు పలువురు రైతులను సత్కరించారు. కార్యక్రమంలో ఏవో విజ్ఞాన్, జ్యోతి, ఏఈవోలు సత్యప్రకాశ్, చంద్రకాంత్, సొసైటీ వైస్ చైర్మన్ సోల్తి భూమాత, డైరెక్టర్లు బండి బాబురావు, తోటకూరి నర్సయ్య, జూలూరి శ్రావణ్, బిళ్ల హరీందర్, గద్దె కొమురమ్మ, పసునూరి భిక్షపతి, దొంతి వేమనారెడ్డి, ముప్ప సతీష్, పిన్నింటి నాగేశ్వర్‌రావు, ఎ.కుమారస్వామి, సుమారు 200 మంది రైతులు పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి రమేష్‌బాబు



రమేష్‌బాబును సత్కరిస్తున్న కార్మిక సంఘాల నేతలు

మిల్స్‌కాలనీ, జూలై 1: వరంగల్ జిల్లా డిప్యూటీ లేబర్ కమిషనర్‌గా పనిచేసిన రమేష్ బాబు నిరంతరం కార్మిక పక్షపాతిగా వ్యవహరించారని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి అన్నారు. వరం గల్ ములుగురోడ్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమం లో ఉమ్మడి వరంగల్ జిల్లా కార్పెంటర్స్ వర్కర్స్ యూనియన్, హనుమకొండ జిల్లా విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఇటీవల పదవీ విరమ ణ చేసిన రమేష్‌బాబును సత్కరించారు. కార్యక్రమంలో వివిధ కార్మికసంఘాల నాయ కులు అలుగోజు కృష్ణమూర్తి, వీణవంక సదానందం, రాళ్లబండి వీరాచారి, వేమునూరి సోమేశ్వర్, కత్రోజు లింగాచారి, వీణవంక రాజేశ్వర్, వెంకన్న, జగన్, బ్రహ్మాచారి, రాజేష్, రామకృష్ణ, వెంకన్న, ఏకాంతం, చంద్రమౌళి, సంపత్, నాగసోమేశ్వరచారి, వెంకటేశ్వర్లు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య వృత్తిని మానవత్వంతో నిర్వర్తించాలి

▸▸ 'డాక్టర్స్ డే' వేడుకల్లో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

పోచమ్మమైదాన్, జూలై 1: సమాజంలో వైద్య వృత్తి పవిత్రమైనదని, వైద్యాన్ని వ్యాపారంగా కాకుండా మానవత్వంతో నిర్వర్తించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం 'డాక్టర్స్ డే' వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీఎంహెచ్‌వో వెంకటరమణ నేతృత్వంలో కేక్ కట్ చేసి వైద్యులకు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తిలో నిరంతరం కొత్త మెలకువలు నేర్చుకోవాలని, అత్యాధునిక వైద్యం చేయడం ఎంతో అవసరమని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధర్‌సింగ్, డాక్టర్ గోపాల్‌రావు, డాక్టర్ ప్రకాష్, అనిల్‌కుమార్, బత్తిని సుదర్శన్‌గౌడ్, రజనీకాంత్, రాధిక, అర్చన, సునీత పాల్గొన్నారు.

● ఖిలావరంగల్ : ఎన్ఎంఏ మెడికల్ రాష్ట్ర కార్యదర్శి ప్రజా వైద్యుడు వలబోజు మోహన్‌రావును టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ ఘనంగా సన్మానించారు. సోమవారం డాక్టర్స్ డే సందర్భంగా 18వ డివిజన్ లేబర్ కాలనీలోని క్లినిక్‌లో మోహన్‌రావును జనమైత్రి ఫౌండేషన్ అధ్యక్షుడు ఎమ్డీ.రహీమ్‌ఖాన్ ఆధ్వర్యంలో శాలువా, బొకే, మెమోంటోలతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సందెల లాజర్, కొల్లూరి డేవిడ్, గుల్లపల్లి రామకృష్ణ, కొండమీది సదానందం, మహబూబ్ జానీ, కోకిల యాకూబ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఖిలావరంగల్ ప్రాంతానికి చెందిన మెడికల్ ఆఫీసర్, వరంగల్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి డాక్టర్ మైదం రాజును ఆర్యవైశ్య కమిటీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ సన్మానించారు.

● మట్టెవాడ : ఆర్యవైశ్య మిత్రబృందం ఆధ్వర్యంలో డాక్టర్స్ డే సందర్భంగా నగరంలోని మేదరివాడలో ఆయూష్, ఇతర డాక్టర్లను సోమవారం ఘనంగా సన్మానించారు. ఆర్యవైశ్య మిత్రమండలి అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ మాట్లాడుతూ రెండేళ్ల నుంచి ఆర్యవైశ్య మిత్రబృందం ఆధ్వర్యంలో డాక్టర్లు, టీచర్స్ మెరిట్ సన్మాన కార్యక్రమం చేస్తున్నట్లు చెప్పారు. సుమారు 20 మంది డాక్టర్లకు సన్మానం చేసినట్లు తెలిపారు. వైద్యులు సాంబమూర్తి, గుండా రవీందర్, ఎండి.అజిత్ హైమద్, మైదం రాజు, రాజ్‌కుమార్, నరేశ్, లిఖిత, సంపత్, మోహన్‌రావు, ప్రముఖ డాక్టర్లను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పళ్ల పరమేశ్వర్, ఇమ్మడి శ్యాంబాబు, చొల్లేటి కిషన్, చొల్లేటి కళావతి, సనిక రమేశ్, రఘుబాబు, ధనలక్ష్మి, సంపూర్ణ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

● కరీమాబాద్ : డాక్టర్స్ డే, చార్టర్డ్ అకౌంటెంట్స్ డే సందర్భంగా రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పలువురు డాక్టర్లను, చార్టర్డ్ అకౌంటెంట్లను సన్మానించారు. సోమవారం నగరంలోని ఫోర్ట్‌రోడ్‌లో గల రోటరీక్లబ్ ఆఫ్ వరంగల్ ఆధ్వర్యంలో ఏడుగురు డాక్టర్లకు, ముగ్గురు చార్టర్డ్ అకౌంటెంట్లకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో వైద్యుల పాత్ర ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుందని అన్నారు. చార్టర్డ్ అంకౌంటెంట్ల సేవలను కొనియాడారు. వైద్యులు గుండా వెంకట్రాజం, సోమ శ్రీధర్, సి.శరత్‌బాబు, రాఘవేంద్ర ప్రదీప్, శ్రేయగౌని, శివ్వ సృజన్, హరి రమాదేవి, చార్టర్డ్ అకౌంటెంట్స్ తోట ధరహాస్, పోల సుమలత, ఓరుగంటి బాలకృష్ణలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ సి.శరత్‌బాబు, ఏజీ గార్లపాటి శ్రీనివాసులు, క్లబ్ 2024-25 అధ్యక్ష, కార్యదర్శులు కురువెళ్ల రాజగోపాల్‌రావు, గంట వేణుగోపాల్, పులూరి కృష్ణమోహన్, ఐపీపీ మామిడాల రమేష్‌బాబు, గుండా ముక్తేశ్వర్‌రావు, తోట వెంకట నాగరాజు, బబ్బుల సుదర్శనం, వెంకటేశ్వర్లు, అనంతుల కుమారస్వామి, నిమ్మల సదానందం యాదవ్, తోట వైద్యనాథ్, మామిడాల సుధాకర్, పాల మదన్‌మోహన్, బండి మన్‌మోహన్ రెడ్డి, కంది క్రాంతికుమార్, సంద్రు శ్రీకాంత్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● శంభునిపేట : తల్లి జన్మనిస్తే తమ వైద్యసేవలతో వైద్యులు పునర్జన్మనిస్తారని లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ వారియర్స్ అధ్యక్షుడు శేర్ల అనిల్‌కుమార్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా సోమవారం పలువురు వైద్యులను క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. రంశాయిపేటలో ఉచిత ఆర్థో, డయాబెటిక్ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు చంద్రశేఖర్ ఆర్యా, ఆకారపు రాజగోపాల్, చంద్రమోహన్, రాజేంద్రప్రసాద్, అంబటి అజయ్ కుమార్, క్లబ్ కార్యదర్శి కందికొండ కుమారస్వామి, కోశాధికారి చలుమల్ల సత్యనారాయణ, యాకూబ్ పాషా, బరుపట్ల రవి పాల్గొన్నారు.



వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో వెంకటరమణతో పాటు వైద్యులను సన్మానిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది



నగరంలోని మేదరివాడలో వైద్యులను సన్మానిస్తున్న ఆర్యవైశ్య మిత్రబృందం



వరంగల్ ఫోర్ట్‌రోడ్‌లోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం పొందిన పలువురు డాక్టర్లు, చార్టర్డ్ అకౌంటెంట్స్

మహిళల రక్షణకు షీ టీమ్ నిరంతర సేవలు

▸▸ షీ టీమ్ సబ్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీ టీమ్ ఎస్సై విద్యాసాగర్

కరీమాబాద్, జూలై 1: మహిళల రక్షణ కోసం షీ టీమ్ నిరంతరం సేవలందిస్తుందని షీ టీమ్ సబ్ ఇన్‌స్పెక్టర్ కంచి విద్యాసాగర్ అన్నారు. షీ టీమ్ ఆధ్వర్యంలో సోమవారం కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నేటి సమాజంలో జరుగుతున్న నేరాలు, ఈవ్ టీజింగ్, బ్యాడ్ టచ్, గుడ్ టచ్ పట్ల అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సై విద్యాసాగర్ మాట్లాడుతూ నేరాలు, అఘాయిత్యాలు పెరుతుగున్న నేటి కాలంలో వాటి అదుపునకు అందరు పాటుపడాలన్నారు. వాటిపై అవగాహన పెంచుకొని జాగ్రత్తగా ఉండటం వలన నేరాలను అదుపు చేయవచ్చని అన్నారు. సుమారు 150 మంది విద్యార్థులకు సైబర్ నేరాలు, మహిళలపై అత్యాచారాలు, విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల అవగాహన కల్పించారు. ముఖ్యంగా అమ్మాయిలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు ఇవ్వకూడదన్నారు.సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ 1930కి ఫిర్యాదు చేయాలని అన్నారు. తెలియని నెంబర్ల నుంచి మహిళలకు ఎవరి నుంచైనా ఇబ్బందులు ఎదురైనా షీ టీమ్ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాలన్నారు. షీ టీమ్ సీపీ 8712685257, సీఐ 8712685142, ఎస్ఐ 8712685270కి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు మురళి, ఉపాధ్యాయులు,షీటీమ్ హెడ్ కానిస్టేబుల్ సూర్యనారాయణ, కానిస్టేబుల్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

వసతి గృహం వద్ద పాముల కలకలం

సంగెం, జూలై 1: సంగెం మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ బాలుర వసతి గృహం వద్ద పాములు కలకలం రేపాయి. సోమవారం ఉదయం హాస్టల్ ప్రహరీని అనుకుని ఒక్కసారిగా పాములు రావడంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు. ఉదయం పాఠశాలలకు వెళ్లేందుకు తయారై ప్రహరీ గోడ వద్దకు రాగానే ఒక్కసారిగా 10-12 పాములు కనిపించడంతో విద్యార్థులతో పాటు స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

పోచమ్మమైదాన్, జూలై 1: వరంగల్ ఎల్‌బీనగర్‌లోని మాసుం అలీ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు నోటుబుక్కుల పంపిణీ జరిగింది. లయన్స్ క్లబ్ ఆఫ్ స్పోర్ట్స్ వరంగల్ ఆధ్వర్యంలో లియో హర్షిత టీం సౌజన్యంతో విద్యార్థులకు బుక్కులు అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు లయన్ రావు రాజీవ్, వంగరి వేణుగోపాల్, ఆర్.కె.నాగరాజు, పోశాల సురేందర్, జయబాలరెడ్డి, కనకయ్య, భిక్షపతి, రయ్యాల శ్రీధరాచార్యులు, దేవేందర్, మోహన్, ఉమ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

శంభునిపేట, జూలై 1 : ఆ పిల్లలకు తండ్రి లేడు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయి ఫీజులు చెల్లించలేని స్థితిలో ఉన్న పిల్లలకు అండగా నిలబడింది హనుమాన్ యూత్ మిత్రబృందం. నగరంలోని రంగశాయిపేటకు చెందిన శ్రీరామోజు రామకృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనకు ముగ్గురు పిల్లలు ఉండగా మదర్ థెరిస్సా పాఠశాలలో చదువుకుంటున్నారు. రామకృష్ణ హనుమాన్ యూత్ సభ్యుడు. మిత్రుడి పిల్లల విద్యా అవసరాలకై హనుమాన్ యూత్ మిత్రబృందం ఆధ్వర్యంలో సోమవారం రూ.54వేల ఆర్థిక సహాయాన్ని పిల్లలకు అందించారు. సహకారం అందించిన మిత్రులకు, పాఠశాల ప్రిన్సిపాల్ అరుణకు హనుమాన్ యూత్ బాధ్యుడు దారబోయిన అనిల్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దారబోయిన అనిల్, శెంకేశి రాజేందర్, కంది రాజేష్, గంట జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 1 : భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ పాఠశాల విభాగం అందిస్తున్న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా డీఈవో డి.వాసంతి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. జూలై 15 లోపు http://nationalawardstoteachers.education.gov.in వెబ్‌పోర్టల్ లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాల్సిందిగా సూచించారు.

అక్రమార్జన చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 1: జిల్లాలో పాఠశాల ఆవరణల్లోనే పుస్తకాలు, యూనిఫామ్ వ్యాపారం చేస్తూ అక్రమార్జన చేస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ సత్య శారదాదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. నల్లబెల్లి మండల కేంద్రంలో శ్రీవిద్యానికేతన్ పేరుతో అనుమతి ఉండగా, ఆదర్శవాణి పేరుతో పాఠశాలను నిర్వహిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి జన్ను రమేష్, సహాయ కార్యదర్శి మార్త నాగరాజు, గ్రేటర్ వరంగల్ నాయకుడు పోలబోయిన రాజు తదితరులు పాల్గొన్నారు.

సిర్క్ కో ఆప్టెడ్ సభ్యుడు నారాయణరావుకు సత్కారం



పీవీ నారాయణరావును సత్కరిస్తున్న సీఏలు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 1: ఐసీఏఐ దక్షిణ భారత ప్రాంతీయ మండలి (సిర్క్)లో పబ్లిక్ అండ్ గవర్నమెంట్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ కమిటీ కోఆప్టెడ్ సభ్యుడిగా ఎన్నికైన ప్రముఖ చార్టెర్డ్ అకౌంటెంట్ పీవీ నారాయణరావును సీఏలు సత్కరించారు. చార్టెర్డ్ అకౌంటెంట్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం వరంగల్ హంటర్‌రోడ్‌లోని ఐసీఏఐ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పీవీ నారాయణరావును శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో త్రిపురనేని గోపీచంద్‌తో పాటు పలువురు సీఏలు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL మంగళవారం 2 జూలై 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

కొత్త చట్టాల్లో మొదటి కేసు నమోదు

వర్ధన్నపేట రూరల్, జూలై 1 : సోమవారం నుంచి అమలులోకి వచ్చిన నూతన చట్టాల నేప థ్యంలో వర్ధన్నపేట మండల పోలీస్ స్టేషన్ పరిధి లో మారిన నూతన చట్టం సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లుగా వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఐపీసీ, సీఆర్పీసీ పదాలకు స్వస్తి పలుకుతూ, ఇప్పుడు బీఎన్ఎస్ (భారతీయ న్యాయ సంహిత), బీఎన్ఎస్ఎస్ (భారతీయ నాగరిక్ సురక్ష సంహిత), బీఎస్ఏ (భారతీయ సాక్ష్య అధినియమ్) సెక్షన్ల కింద కేసులు నమోదవుతాయని తెలిపారు. మండలంలోని అంబే ద్కనగర్ గ్రామంలో జరిగిన ఆత్మహత్య కేసును, నూతన చట్టాలకు అనుగుణంగా నమోదు చేసినట్లు తెలిపారు. గతంలో ఆత్మ హత్య ఘటనకు సీఆర్పీ 174 సెక్షన్‌లో నమోదు చేయగా, ప్రస్తుతం 194 బీఎన్ఎస్ఎస్ కింద నమోదు చేసినట్లుగా స్పష్టం చేశారు.

ఏజెన్సీ గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నల్లబెల్లి, జూలై 1 : ఏజెన్సీ గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొండాపూర్, మురళినగర్, గణేష్ నగర్ గ్రామాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. నూతనంగా నిర్మాణం చేస్తున్న విద్యుత్ సబ్ స్టేషన్‌ల పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. కొండాపూర్, మురళినగర్, గణేష్ నగర్‌లను కలుపుతూ లింకు రోడ్డు పనులను పూర్తి చేస్తామన్నారు. ఏజెన్సీ గ్రామాల ప్రజలకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారాలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నర్సింహమూర్తి, పవిత్ర, రజిత, మండల నాయకులు చిట్యాల తిరుపతిరెడ్డి, వైనాల అశోక్, చార్ల శివారెడ్డి, మునీందర్, రాంమూర్తి, కద్దూరి కట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలుర వసతి గృహం వద్ద పాముల కలకలం



వసతి గృహం వద్ద పాము

సంగెం, జూలై 1: సంగెం మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ బాలుర వసతి గృహం వద్ద పాములు కలకలం రేపాయి. సోమవారం ఉదయం హాస్టల్ ప్రహరీని అనుకుని ఒక్కసారిగా పాములు రావడంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు. ఉదయం పాఠశాలలకు వెళ్లేందుకు తయారై ప్రహరీ గోడ వద్దకు రాగానే ఒక్కసారిగా 10-12 పాములు కనిపించడంతో విద్యార్థులతో పాటు స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

టీజీ బీసీ పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సురేష్



నియామక పత్రం అందుకుంటున్న సురేష్

సంగెం, జూలై 1 : తెలంగాణ బీసీ ప్రజా సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సంగెం మండలంలోని కొత్తగూడెంకు చెందిన వాసం సురేష్ నియమితులయ్యారు. సోమవారం వరంగల్‌లో జరిగిన తెలంగాణ బీసీ ప్రజా సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్, రాష్ట్ర మహిళా ఇన్‌చార్జ్ లయన్ డాక్టర్ పద్మజ నుంచి నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ బీసీ కులాలను ఐక్యం చేస్తూ ఉద్యమాలు చేసేందుకు రాష్ట్ర నాయక త్వం తనకు అందించిన బాధ్యతలను విజయవంతం చేయనున్నట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన వారందరికి సురేష్ కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 1 : భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ పాఠశాల విభాగం అందిస్తున్న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా డీఈవో డి.వాసంతి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. జూలై 15లోపు జ్ట్టిః//ౖఞజ్బౌఞ్బాౌఞ్చీటఛీట్ఞ్ఠౌఛిజ్ఞ్టటఞ్ఛీట్ఞ్ౖజ్బొ.జౌౌరి.జీ వెబ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాల్సిందిగా సూచించారు.

తీగ లాగితే డొంక కదులుతోంది..

నిబంధనలకు విరుద్ధంగా లే అవుట్‌లో నిర్మాణాలు

స్పష్టం చేసిన పంచాయతీ అధికారులు

చర్యలు తీసుకోని జీపీ కార్యదర్శి

వర్ధన్నపేట రూరల్, జూలై 1 : 'వెంచర్‌పై వివాదమంటూ 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి తీగ లాగితే డొంక కదులుతోంది. వర్ధన్నపేట ఎంపీవో ధనలక్ష్మి సోమవారం లేఅవుట్ ప్రాంతాన్ని పరిశీలించారు. జరుగుతున్న నిర్మాణాలపై ఆరాతీశారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేయడమేమిటని కార్యదర్శి రామారావును ప్రశ్నించారు. దీనిపై కనీసం వెంచర్ నిర్వాహకులకు నోటీసులు సైతం ఇవ్వకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది.

చక్రం తిప్పిన కార్యదర్శి?

చాలా కాలంగా ఇల్లంద గ్రామ కార్యదర్శిగా పని చేస్తున్న రామారావు లే అవుట్ అనుమతుల్లో ఎంతో చాకచక్యంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. కనీసం మండల అధికారులకు, జిల్లా ఉన్నతాధికారులకు సైతం సమాచారం లేకుండా నిర్వాహకులకు సహకరించినట్లు అధికారుల విచారణలో తేలింది. డీటీసీపీ నుంచి అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న వారిని పిలిపించి, గ్రామ పంచాయతీ పాలకవర్గం ఉన్నప్పుడే తీర్మానం చేయించినట్లుగా రికార్డులో కనిపిస్తోంది.. అనంతరం ప్రత్యేక పాలన వచ్చిన తర్వాత లే అవుట్ నుంచి గ్రామ పంచాయతీకి నిర్వాహకులు కొంత శాతం వరకు భూమిని రిజిస్ట్రేషన్ చేయాలి. ఆ రిజిస్ట్రేషన్ సైతం పై అధికారుల అనుమతి లేకుండానే చేసుకున్నాడు. అన్నీ సక్రమ మార్గంలో చేస్తున్నానని అనుకున్న గ్రామ కార్యదర్శి అసలు విషయంలో నిబంధనలను గాలికి వదిలేసినట్లుగా విచారణలో తేలింది. టెక్నికల్ అధికారులు



ఇల్లందలోని లే అవుట్‌లో వివరాలు తెలుసుకుంటున్న ఎంపీవో ధనలక్ష్మి, పక్కన కార్యదర్శి రామారావు

డీటీసీపీ డెవలప్‌మెంట్ డ్రాఫ్ట్‌ను అందించిన విధంగా నిర్వాహకులు రోడ్లు, డ్రైనేజీ ఇతర సదుపాయాలను ఇంకా పూర్తి చేయలేదు. అవేమి చేయకుండా వెంచర్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం, అందులో భవన నిర్మాణాలను ప్రారంభించారు. కార్యదర్శి వీటికి అనుమతులు ఇవ్వకుండానే వారు పనులు ప్రారంభించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

దారి కబ్జా చేశారంటూ రైతు ఫిర్యాదు

తమ వ్యవసాయ భూమికి వెళ్లే దారిని కబ్జా చేసి, అక్రమంగా ప్రహరీ గోడ నిర్మాణం చేశారని సోమవారం గ్రామానికి చెందిన మంచోజు రాంబ్రహ్మాచారి ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. తన వ్యవసాయ భూమిలోకి వెళ్లేందుకు 6ఫీట్ల బండ్లబాట ఉందని, దానిని కబ్జా చేసి, గోడ నిర్మించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. గతంలో మే నెలలో సైతం పలువురు రైతులు వెంచర్ ప్రహరీ గోడను అనుకుని ఉండే కోమటికుంట పంట కాలువను సైతం రెండు గజాల వరకు కబ్జా చేశారని కార్యదర్శికి ఫిర్యాదు అందించారు. వెంచర్ పక్క రైతులు తమతమ సర్వే నెంబర్లు వేసి తమకు సమాచారం లేకుండానే ప్రహరీ గోడ నిర్మాణం చేశారని, పూర్తి వివరాలు తెలియాలని ఆర్టీఐ యాక్ట్ ద్వారా కూడా సమాచారంకోరారు. అయినా అధికారులు స్పందించలేదు. దీనిపై గతంలో పోలీసులకు సైతం ఫిర్యాదు చేయగా, ఎన్నికల కారణంగా సమస్య తర్వాత పరిష్కరిస్తామని చెప్పగా, ఇదే అదనుగా భావించిన లే అవుట్ నిర్వాహకులు అక్రమంగా గోడను నిర్మించేశారు. గ్రామ తీర్మానం తమకు తెలియదని, కనీసం చుట్టూ పక్కల రైతులకు నోటీసులు కూడా జారీ చేయలేదని మంచోజు రాంబ్రహ్మాచారి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపాడు.

ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు

ఇల్లంద గ్రామ కార్యదర్శి లీలలు అన్నీ ఇన్నీ కావని స్థానికులు ఒక్కొక్కటిగా చెపుతున్నారు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ కార్యదర్శి చేస్తున్న అక్రమాలను బయట పెడుతున్నారు. కొంత మంది ప్రైవేటు వ్యక్తులతో కుమ్మక్కై ఖాళీ స్థలాలకు నిర్మాణాలు చేయకుండానే ఇంటి నెంబర్లను కేటాయించాడని ఆరోపిస్తున్నారు. ఇండ్లనివాసంలో ఉన్న ఇంటి నెంబర్లను కొంత మంది వ్యక్తుల ఖాళీ ప్లాట్లకు



కబ్జాకు గురైన దారిని చూపుతున్న రైతు రాంబ్రహ్మాచారి

నెంబర్లు కేటాయించి వారికి సులువుగా రిజిస్ట్రేషన్ చేసేలా సహకరించాడని ఆరోపిస్తున్నారు. మామూళ్లు తీసుకుని వ్యవసాయ భూముల మధ్యలో ఉన్న కొన్ని ఖాళీ ప్లాట్లకు ఇంటి నెంబర్లు అందించడం నిబంధనలకు విరుద్ధమని తెలిసినా కార్యదర్శి వాటన్నింటినీ బేఖాతరు చేస్తున్నాడని చెపుతున్నారు. ఇలా ఎన్నో ప్రభుత్వ ఖజానాకు గండి పడే విధంగా వ్యవహరిస్తూ తన సొంత నిర్ణయాలతో చేయడం పట్ల ఉన్నతాధికారులు సైతం కార్యదర్శిపై గుర్రుగా ఉన్నారు.

లే అవుట్‌లో అక్రమ నిర్మాణాలు నిజమే..

ధనలక్ష్మి, ఎంపీవో, వర్ధన్నపేట

ఇల్లంద గ్రామంలో ఏర్పాటవుతున్న లే అవుట్‌ను గ్రామ కార్యదర్శి రామారావుతో కలిసి సందర్శించాను. అందులోని నిర్మాణాలు అక్రమంగా చేస్తున్నారు. ప్రహరీ గోడ, భవన నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు లేవు. టీఎస్ గ్రూపు ద్వారా తాళ్లపెల్లి చంద్రశేఖర్ అనే వ్యక్తి డీటీసీపీ లే అవుట్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. 2024 జనవరి 4న గ్రామసభ తీర్మానం జరిగినట్లు కార్యదర్శి తెలిపాడు. తిరిగి 2024 జనవరి 25న డ్రాఫ్ట్ టెక్నికల్ లే అవుట్ ప్యాటర్న్ వచ్చింది. జీపీకి సంబంధించి 2024జనవరి 28న రూ.3,75,516 ఆన్‌లైన్ ద్వారా చలానా చెల్లించారు. ఇరిగేషన్‌సైతం ఎన్‌వోసీ ఇచ్చింది. జీపీకి 10శాతం గ్రీనరీ కోసం, 15శాతం 2024 మార్చి 15న మార్ట్‌గేజ్ చేశారు. పూర్తిగా లే అవుట్‌ను డెవలప్ చేసిన తర్వాతనే, జీపీ నిబంధనలకు అనుగుణంగా అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేయాలి.

'అక్రమార్జన చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 1 : జిల్లాలో పాఠశాల ఆవరణల్లోనే పుస్తకాలు, యూ నిఫామ్ వ్యాపారం చేస్తూ అక్రమార్జన చేస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ సత్య శారదాదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. నల్లబెల్లి మండల కేంద్రంలో శ్రీవిద్యానికేతన్ పేరుతో అనుమతి ఉండగా, ఆదర్శవాణి పేరుతో పాఠశాలను నిర్వహిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి జన్ను రమేష్, సహాయ కార్యదర్శి మార్త నాగరాజు, గ్రేటర్‌వరంగల్ నాయకుడు పోలబోయిన రాజు తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి దెబ్బతిన్న ఇల్లు

ఖానాపురం, జూలై 1: మండలంలోని బుధరావుపేటకు చెందిన బత్తిని శ్రీనుకు చెందిన పెంకుటిల్లు ఇటీవల కురుస్తున్న వర్షాలతో సోమవారం ఇంటిపై కప్పుకూలి ఇల్లు దెబ్బతింది.ఇంట్లోని ఫర్నీచర్, వంట సామగ్రి, బియ్యం,గ్యాస్ తదితర వస్తువులు ధ్వంసమయ్యాయి. కుటుంబ సభ్యులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీనుకు ప్రభుత్వం ఇందిరమ్మ పథకం కింద ఇంటిని మంజూరి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

'ప్రాథమిక పాఠశాలను పట్టించుకోవాలి'

చెన్నారావుపేట, జూలై 1 : మండలంలోని ఉప్పరపల్లి ప్రాథమిక పాఠశాలలను పట్టించుకోవాలని కలామ్ ఫౌండేషన్ సభ్యులు సోమవారం జిల్లా కలెక్టర్ సత్య శారదదేవికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కలామ్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎండీ బాషమియా మాట్లాడుతూ పాఠశాలలో అనేక సమస్యలున్నాయని ప్రధానంగా బడి భవనాలు పూర్తిగాలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షంవస్తే బడినిండా వరద నీరు నిలిచి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, డీఈవో, ఎంఈవోలు వెంటనే స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి పరికి మధుకర్, ఉడ్గుల రాజు, పోగుల అశోక్, కాస రాజేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నర్సంపేట టౌన్, జూలై 1 : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 1990-91 సంవత్స రంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థినులు పట్ట ణంలోని పద్మశాలి గార్డెన్స్‌లో సోమవారం పూర్వ విద్యార్థు లు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. హైదరా బాద్, వరంగల్, నర్సంపేట తదితర ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు 33 ఏళ్ల తర్వాత కలుసుకొని ఆనందాన్ని పంచుకున్నారు. చదువుకున్న రోజుల్లోని జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమానికి వనప్రేమి అవార్డు గ్రహీత గోకా రామస్వామిని ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శింగిరికొండ రజని, ఉమ, మీన, రమాదేవి, మంజుల, సునీత, భాగ్య, రేణుక, అనిత, సుజాత, శ్రీలత, కవిత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలి



బస్టాండ్‌లో పాటలు పాడుతున్న కళాకారులు

నర్సంపేట, జూలై 1: ఆర్టీసీ బస్సుల్లో ప్రజలు ప్రయాణించి డిపో ఆదాయం పెరగడానికి సహకరించాలని కోరుతూ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కళాకారులు సోమవారం పాటలు పాడుతూ కళాప్రదర్శన నిర్వహించారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి ఆర్టీసీ సంస్థకు సహకరించాలని పాటల రూపంలో ప్రయాణికులను చైతన్యపరిచేందుకు కార్యక్రమం ఆర్టీసీ డిపో మేనేజర్, సిబ్బంది సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాబృందం కళాకారులు వెంకన్న, జిల్లెల సంపత్, ముత్యాల సాంబయ్య, ఏఎల్ నారాయణలను డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ భవాని, ట్రాఫిక్ సూపర్ వైజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్యం



వర్ధన్నపేటలో కేక్‌కట్ చేస్తున్న వైద్యులు

వర్ధన్నపేట, జూలై 1 : ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిపుణులైన వైద్యులు ఉండడంతో నాణ్యమైన వైద్యం పేద ప్రజలకు అందుతుందని వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహస్వామి అన్నారు. డాక్టర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రి నిరుపేదలకు అండగా ఉంటూ ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా వైద్యం అందిస్తున్నామన్నారు. డాక్టర్స్ డేను పురస్కరించుకుని ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రం చేశామన్నారు.

• దుగ్గొండి ; మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం డాక్టర్స్ డే సందర్భంగా ఘనంగా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిరణ్‌రాజు, హెచ్‌ఈవో సాంబయ్య, రహమాన్, చాణిక్య, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ



దుగ్గొండిలో మాట్లాడుతున్న డీఏవో ఉష

దుగ్గొండి, జూలై 1 : రైతు బంధు, రైతు భరోసాలపై రైతుల అభిప్రాయం తెలపాలని రైతులను జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాల్ రైతులకు సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక, నాచినపల్లి సొసైటీలో, లక్ష్మీపురం రైతు వేదకలలో సోమవారం రైతులచే ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. హాజరైన రైతుల అభిప్రాయాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్‌లు సుకినే రాజేశ్వర్‌రావు, ఊరటి మహిపాల్‌రెడ్డి, ఫైడి, అసిస్టెంట్ రిజిష్టర్ నాగనారాయణ, ఏవో దయాకర్, ఏఈవోలు మోడెం విశ్వశాంతి, రాజేష్, హన్మంతు, మధు, సొసైటీ సీఈవోలు సోమ ఓంకార్, భిక్షపతి, రమేశ్‌లు పాల్గొన్నారు.

చెన్నారావుపేట సహకార సంఘంలో

లావాదేవీల వివరాలు అందించాలి

చెన్నారావుపేట, జూలై 1 : చెన్నారావుపేట సహకార సంఘంలో జరిగిన నాలుగు సంవత్సరాల లావా దేవిలపై పూర్తి వివరాలను అందించాలని మాజీ ఎంపీపీ జక్క అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సహకార సంఘంలో జరిగిన లావాదేవిలపై గతంలోనే సమాచార హక్కు చట్టం కింద వివరాలు కావాలని సీఈవో రవిని కోరామన్నారు. సీఈవో రవి జూన్ 26న సహకార సంఘానికి అధికారులు. వస్తున్నారని చెప్పారని, ఆ రోజు ఎవరు రాలేదన్నారు.

సహకార సంఘంలో జరిగినా లావా దేవిలపై పూర్తి వివరాలను అందించాలని పలు మార్లు కోరినా సీఈవో పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు సహకారం సంఘంలో జరిగినా లావాదేవిలను పరిశీలించి సీఈవో రవిపై చర్యలు తీసుకోవాలన్నారు.

మాదిగల మహాజాతర సభను విజయవంతం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వర్ధన్నపేట, జూలై 1: ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఈదుముడిలో ఈ నెల 7న మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బీఎన్ రమేష్‌కుమార్ మాదిగ ఆధ్వర్యంలో జరిగే మాదిగల మహా జాతర సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఈరెల్లి శ్రీనివాస్ మాదిగ ఎమ్మార్పీఎస్ శ్రేణులకు పిలుపు నిచ్చారు. మాదిగల మహా జాతర సభకు సంబంధించిన కరపత్రాలను వర్ధన్నపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాదిగతో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గద్దల కుమార్ మాదిగలు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం 30 వసంతాలు జరుపుకుంటున్న సందర్భంగా ఈ సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఏబీసీడీ వర్గీకరణ చేస్తామన్న బీజేపీ ఎందుకు జాప్యం చేస్తున్నదని దుయ్యబట్టారు. అధికారంలో ఉన్న 10ఏళ్ల పాటు ఏబీసీడీ వర్గీకరణ చేయకుండా ప్రధాని నరేంద్రమోదీ మాదిగ సమాజాన్ని మోసం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర, జిల్లా నేతలు ఎలికట్టె ప్రభాకర్, రడపాక యాకయ్య, దుబ్బ అంజయ్య, ఎలికట్టె ఎల్లయ్య, గడ్డం విజయ్‌కుమార్, గబ్బెట భాస్కర్, చిలు ముల్ల దయాకర్, పొన్నాల కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



బస్సును ప్రారంభిస్తున్న ఎస్సై మహేందర్, ప్రిన్సిపాల్ కరుణశ్రీ

నెక్కొండ, జూలై 1 : ప్రభుత్వ జూనియర్ కళశాలల్లో విద్య ను అభ్యసించిన విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధనను అం దించడమే కాకుండా, అన్ని రకాల సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని నెక్కొండ ఎస్సై మహేందర్, ప్రభుత్వ జూనియర్ కళశాల ప్రిన్సిపాల్ కరుణశ్రీ తెలిపారు. నెక్కొండలోని ఎస్సీ, ఎస్టీ , బీసీ ప్రభుత్వ హాస్టల్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళశాల వరకూ ఏర్పాటు చేసిన ఉచిత బస్సు సౌకర్యాన్ని సోమవారం వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ హాస్టల్ కళాశాలకు దూరంగా ఉండ డంతో విద్యార్థులు రకపోకల విషయంలో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి కళశాల అధ్యాపకులు, దాతల సౌజన్యంతో ప్రైవేట్ బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రణయ్‌కుమార్, అధ్యాపకులు చంద రమణాకర్, ప్రభాకర్, సంపత్, రంజిత్‌కుమార్, ఆనందం, కీర్తి, భీమేందర్, శ్రీలత, భిక్షపతి, లక్ష్మణ్, రాజు, లైబ్రెరియన్ బాబు, హాస్టల్‌వార్డెన్ హాల్‌సింగ్, గ్రామ కార్యదర్శి సదానందం తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో జీపీ ఉద్యోగి మృతి



సూరయ్య (ఫైల్)

సంగెం, జూలై 1 : గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని ఎల్గూరురంగంపేట లో చోటుచేసుకుంది. గ్రామస్థులు, ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... ఎల్గూరురంగంపేట గ్రామానికి చెందిన కడారి సూరయ్య (58) స్థానిక గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా సోమవారం ఉదయం ఫ్యూజ్ వైరు పోవడాన్ని గుర్తించి విద్యుత్ స్తంభంపై వేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురవడంతో కిందపడి మృతి చెందాడు. కుమారుడు రంజిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎంకు తరలించగా, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై వివరించారు. సూరయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. కాగా, మృతదేహాన్ని పర్వతగిరి సీఐ శ్రీనివాస్ సందర్శించి పరిశీలించారు. నిరుపేద అయిన సూరయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

ఒంటరితనం భరించలేక ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న వికాస్

వర్ధన్నపేట రూరల్, జూలై 1 : ఒంటరితనం భరించలేక, మనస్థాపానికి గురై యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అంబేద్కర్‌నగర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ కథనం ప్రకారం... మండలంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన బంక సంజీవ కుమార్‌కు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు బంక వికాస్ అలియాస్ చంటి (22) పదో తరగతి పూర్తిచేసి, గ్రామంలోనే కూలీ పనులు చేసుకుంటున్నాడు. కొన్ని రోజుల క్రితం కుటుంబం హైదరాబాద్‌లో కూలీపనుల నిమిత్తం వెళ్లగా, పెద్ద కుమారుడు వికాస్ కుటుంబంతో పోకుండా ఇక్కడే కూలీపనులు చేసుకునేవాడు. ఇదే తరుణంలో గ్రామంలో ఉన్న తన స్నేహితులు, బంధువులతో కుటుంబాన్ని వదిలి ఒక్కడినే ఉంటున్నానని బాధపడేవాడు. తమ సొంత ఇంటిలో ఒక్కడే ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్న వికాస్‌కు ఒంటరి తనం భారంకావడంతో మనస్థాపానికి గురై ఇంట్లోని దూలానికి చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, వారు గ్రామానికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. 194 బీఎన్ఎస్ఎస్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టంనిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

గీతకార్మికుడికి తీవ్ర గాయాలు

ఖానాపురం, జులై 1 : మండలంలోని మంగళవారిపేటలో తాటిచెట్టుపై నుండి పడి గీతకార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన గీతకార్మికుడు తాళ్లపెల్లి పెద్దకమలాకర్ గౌడ్ గీతవృత్తిలో భాగంగా సోమవారం గ్రామ శివారులోని ఊర చెరువు సమీ పంలో తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కింద పడటంతో కాళ్లకు, ఛాతి భాగంలో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బాధితుడిని నర్సంపేటకు తరలించారు. గాయపడ్డ గీత కార్మికుడిని ప్రభుత్వపరంగాఆదుకోవాలని బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు పైండ్ల యాదగిరి ప్రభుత్వాన్ని కోరారు.

వీధిలైట్లు వెలగక ప్రజల అవస్థలు

దుగ్గొండి, జూలై 1: మండలంలోని తిమ్మంపేటలో కొన్ని వాడలలో వీధిలైట్లు కాలిపోయి రాత్రి వేళల్లో వెలగకపోవడంతో ప్రజలు భయందోళన చెందుతున్నారు. వర్షాకాలం కావడంతో వీధి లైట్లు వెలుగని కారణంగా విషపురుగులు కాటు వేస్తాయనే భయ్యాన్ని ప్రజలు వ్యక్తపరుస్తున్నారు. గత 20రోజులుగా చీకట్లో ప్రయాణించడం జరుగుతుందని, ఇప్పటికైన సంబంధిత అధికారులు పట్టించుకొని వీధిలైట్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

వాయిదా పడిన సంత వేలంపాట

నెక్కొండ, జూలై 1 : నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించే వారంతపు సంతకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన వేలం పాటల్లో గొర్రెలు, మేకల రహదారికి నిర్ణీత ధర రాకపోవడంతో వాయిదా వేసినట్లు కార్యదర్శి సదానందం తెలిపారు. అలాగే తైబజారు కాంట్రాక్టును రూ. 1.30 లక్షలకు గుత్తెదారు రావుల హరీష్‌రెడ్డి దక్కించుకున్నారు. పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు తిరిగి గొర్రెలు, మేకల రహదారికి వేలం పాటలను నిర్వహిస్తామన్నారు.